www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
19 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 224

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## తింటున్నది నెయ్యేనా?

- హైదరాబాద్‌లో భారీగా పట్టుబడిన అక్రమ నెయ్యి
- తక్కువ ఖర్చుతో కూడిన నూనెలు, కొవ్వుల వాడకం
- జీర్ణవ్యవస్థ దెబ్బతిని దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం
- లేబుల్ లేని విడి నెయ్యిని ఎప్పుడూ కొనకూడదు
- ప్యాకెట్లపై లైసెన్స్, తయారీ తేదీలను తప్పక చూడాలి
- తక్కువ ధరకు ఆశపడి కల్తీ నెయ్యిని కొనుగోలు చేయవద్దు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మార్కెట్లో లీటర్ పాల ధర సుమారు 60 రూపాయలు ఉంది. పాలలోని కొవ్వు శాతం ఆధారంగా నెయ్యి తయారవుతుంది. ఒక కిలో నెయ్యి రావడానికి 30 లీటర్ల పాలు అవసరమైతే కేవలం పాల ఖర్చే 1800 రూపాయలు అవుతుంది. దీనికి మజ్జిగ వేరు చేయడం, విద్యుత్, ప్యాకింగ్, రవాణా, కార్మికుల ఖర్చులు అదనంగా కలుస్తాయి. మరి ఇన్ని వ్యయాలు ఉండగా కొందరు వ్యాపారులు నెయ్యిని అసాధారణంగా తక్కువ ధరకు ఎలా అమ్ముతున్నారు? హైదరాబాద్ నగరంలో ఇటీవల జరిగిన తనిఖీలలో ఏకంగా 25.5 టన్నుల కల్తీ నెయ్యి పట్టుబడింది. 10.5 టన్నుల ముడి సరుకును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంటే మొత్తం 36 టన్నుల కల్తీ సరుకు బయటపడింది.

మిగతా 3లో..

## పొంగులేటి రాబరీ మినిస్టర్



- కాంగ్రెస్ పాలనలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగింది: ఈటల రాజేందర్
- పేదల భూములను 22-A నిషేధిత జాబితాలో చేర్చడం దారుణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 'రాబరీ మినిస్టర్'గా మారారు
- ఫీనిక్స్ కంపెనీ ద్వారా భారీగా వేల కోట్ల ఆస్తుల బదిలీ జరిగిందని ఆరోపణ

02

## అగ్గిపెట్టె రావు పాపాలన్నీ తెలుసు!



- హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి కౌంటర్
- ధరణి పేరుతో భూములు దోచారంటూ తీవ్ర ఆరోపణలు
- రాజకీయ లబ్ధి కోసమే అగ్గిపెట్టె డ్రామాలు అంటున్న వైనం
- పదేళ్ల పాలనలో భారీ భూదోపిడీ జరిగిందని విమర్శలు

03

## కవిత భూలక్ష్మి బాంబ్..!



- పేదలకు ఎకరం భూమి ఇచ్చే పథకం ప్రకటన
- రేవంత్ రెడ్డి పాలనపై కవిత ఆరోపణలు
- దళితుల మూడెకరాల భూమి అంశం చర్చకు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు
- నిధులు, భూ లభ్యతపై స్పష్టత లేకపోవడం
- అంతిమ నిర్ణయం ప్రజల చేతుల్లోనే ఉండటం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా భగ్గుమంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విసిరిన 'భూలక్ష్మి' బాంబుతో రేవంత్ సర్కార్‌తో పాటు అధికార కాంగ్రెస్ వర్గాల్లో ఒక్కసారిగా ప్రకంపనలు మొదలయ్యాయి. తెలంగాణ రక్షణ సేన చీఫ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే పేదలకు భూమి పంపిణీ చేయాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి అందిస్తామని ప్రకటించారు. ఇందుకోసం 'భూలక్ష్మి' పేరుతో విప్లవాత్మక పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ

మిగతా 2లో..

## కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పడుతున్నయ్

- పెద్ది విగ్రహం తొలగింపుపై కేటీఆర్ ఆగ్రహం
- రాత్రికి రాత్రే తొలగించడం దారుణమని విమర్శ
- పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టిన వైనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నేతల అరెస్టు
- పెద్ది కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా
- భవిష్యత్తులో మెడికల్ కాలేజీకి పేరు పెడతాం

03






# పాలనలో తడబాటు?

హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రాంతాలు జాబితాలో ఉండటంతో కుదేలు

- సన్న వడ్ల బోనస్, రైతు భరోసా, బీమా అమలులో జాప్యం
- 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ ఆస్తులు చేరడం
- ఫీజు రీఎంబర్స్మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం
- కూల్చివేతలు, ప్రక్షాళనపై ప్రజల్లో భయాందోళనలు
- బీఆర్ఎస్, బీజేపీల పోరాటం, కమిషన్ల ఆరోపణలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలనా వైఫల్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రజలు ఎన్నో ఆశలతో గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కోరుకున్నారు. అయితే ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలులో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా రైతులకు సంబంధించిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదు. సన్న వడ్ల బోనస్ చెల్లింపులు ఆలస్యం కావడం రైతులను తీవ్రంగా బాధిస్తోంది. రైతు భరోసా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తగా రైతు బీమా వంటి పథకాలు నిలిచిపోవడంపై రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాయి. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి

మిగతా 2లో..



## విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు మంత్రి అభినందనలు

- 2 వేల కోట్లు తో అదనంగా 65 ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు
- విద్యార్థులకు నెలకు 2000 స్టైఫండ్
- విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషికి మంత్రి అభినందించారు

07




## తెలంగాణలో 73 లక్షల ఓట్లు తొలగింపు..

- 92 లక్షల ఓట్లపై ప్రశ్నార్థకం
- ఎన్నికల కమిషన్ తీరుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం

04

## ప్రభుత్వ ధాన్యం మాయం..!

- మిల్లర్లు బియ్యం ఇవ్వకపోవడంతో రూ.6,631 కోట్ల బకాయిలు
- అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు
- ప్రభుత్వం అప్పులు తెచ్చి రైతులకు చెల్లించాల్సి వస్తోంది
- విజిలెన్స్ అధికారులు మిల్లుల్లో స్టాక్‌పై దాడులు చేస్తున్నారు
- బకాయిదారుల ఆస్తులను జప్తు చేసి నిధులను రాబడుతున్నారు
- డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షణకు ప్రణాళికలు రచిస్తున్నారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మర ఆడించడం కోసం రైస్‌మిల్లర్లకు అప్పగిస్తోంది. మిల్లర్లు ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. కానీ కొందరు మిల్లర్లు ఆ ధాన్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఒక సీజన్‌లో అందాల్సిన బియ్యం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి రూ.6,631 కోట్ల భారీ బకాయిలు పేరుకుపోయాయి. ఈ సమస్య ఒక్క రోజులో రాలేదు. గత ప్రభుత్వాల హయాంలో రూ.4,939 కోట్లు పెరిగితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో రూ.1,692 కోట్లు పెరిగాయి. మొత్తం 2,388 రైస్‌మిల్లులు ఈ కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిల జాబితాలో ఉన్నాయి. ఈ ఆర్థిక భారం పూర్తిగా ప్రజాధనంపై పడుతోంది. ప్రభుత్వం బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి రైతులకు డబ్బులు ఇస్తోంది. మిల్లర్లు బియ్యం ఇవ్వకపోతే ఈ ఆర్థిక చక్రం పూర్తిగా గాడి తప్పుతుంది. ప్రభుత్వం ఇస్తున్న ధాన్యానికి మిల్లర్లు యజమానులు కరువయ్యారు. వారికి కేవలం జాబ్‌వర్క్ మాత్రమే ఉంటుంది. ధాన్యాన్ని బియ్యంగా మార్చినందుకు ప్రభుత్వం మిల్లింగ్ చార్జీలు ఇస్తుంది. తౌడు, నూకలు వంటి

మిగతా 2లో..

## కాల్చిచంపే పద్ధతులు వద్దు

- మరణశిక్షకు విషపు ఇంజెక్షన్ అమలు చేయాలి
- ఉరిశిక్ష కంటే తక్కువ బాధ కలిగే మార్గాలపై నిర్ణయం కేంద్రానిదే
- ఉరిశిక్షపై సుప్రీం కీలక వ్యాఖ్యలు



03



## కేసీఆర్ చేసిన అప్పు తెలంగాణకు ముప్పు

- హైదరాబాద్‌లో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు
- కేసీఆర్ హయాంలోని అప్పులు రాష్ట్రానికి ముప్పు
- కాంగ్రెస్ పాలనలో బహుజనులకు సముచిత స్థానం
- ప్రజాపాలనలో అన్ని వర్గాలకూ సమన్యాయం
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలపై ఆగ్రహం
- నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వానిదే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మాజీ సీఎం కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిటి ముప్పుగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సర్దుబాట్లు చేసుకుంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ పాలనతోనే సాధ్యం అన్నారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కల్వకుంట్ల కుటుంబ పాలనలో కేసీఆర్ సీఎం అయితే ఆయన కుమారుడు

మిగతా 3లో..

# పొంగులేటి రాబరీ మినిస్టర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



భూ దందాల ప్రాధాన్యతగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగుతుందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండు రెట్లు పెరిగిందని ఈటల ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు చివరికి ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా ఇరవై రెండు ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక వాటిని భూమాఫియాకు కట్టబెట్టాలనే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ధరణి పోర్టల్ రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను సెటిల్ మెంట్ చేసుకుంటోందని ఈటల ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ధరణి నుంచి భూ భారతి వరకు పేద రైతులపైనే భారం పడుతుందని ఇరవై రెండు ఏ నిషేధిత చట్టాన్ని కేసీఆర్ తీసుకొస్తే దాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యథావిధిగా అమలు చేస్తోందని ఈటల రాజేందర్ విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణిని రద్దు చేసి బంగాళాఖాతంలో వేస్తామని చెప్పారు కానీ ధరణి తర్వాత తీసుకొచ్చిన భూ భారతితో పేద రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈ అక్రమాల్లో పెద్దల హస్తం స్పష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. పేదలకు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ము కాయడం మానుకోవాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. ఈ అరాచకాలను పూర్తిగా అడ్డుకునే వరకు బీజేపీ తరఫున పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాబరీ మినిస్టర్ గా మారారని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. మంత్రి కాకముందు నీ ఆస్తులెంత ఇప్పుడు ఎంత అని ఆయన నిలదీశారు. లక్షల కోట్ల విలువైన భూములను ఇరవై రెండు ఏ జాబితాలో పెట్టి పెద్ద ఎత్తున భూదందా చేస్తున్నారని ప్రభుత్వం ఒక బ్రోకర్‌లా మారిందని ఆయన మండిపడ్డారు. మంత్రికి ప్రభుత్వానికి మధ్య ఫీనిక్స్ కంపెనీ ఒక మీడియేటర్‌లా వ్యవహరిస్తోందని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్‌కు ఫీనిక్స్ కంపెనీ బినామీగా ఉందని బహిరంగంగా ఆరోపించిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు అదే కంపెనీతో కలిసి డైరెక్ట్‌గా బ్రోకర్లుగా మారారని విమర్శించారు. ఫీనిక్స్ కంపెనీ నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పొంగులేటికి చెందిన వివిధ కంపెనీలకు దాదాపు పదిహేను వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు బదిలీ అయ్యాయని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధారాలతో సహా ఆరోపించారు. తన శాఖలో భారీ తప్పులు జరిగాయని మంత్రి స్వయంగా అంగీకరిస్తూ క్షమాపణ కోరుతున్నప్పుడు నైతిక బాధ్యత వహించి వెంటనే ఎందుకు రాజీనామా చేయడం లేదని ఆయన గట్టిగా నిలదీశారు. తప్పులు చేసిన అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులను అడ్డగోలుగా దోచుకుని ఇతర సంస్థలకు బదలాయించుకుని ఇప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అన్నింటినీ కప్పిపుచ్చుకునే ప్రయత్నం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా చేస్తున్నారని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం గాలికి వదిలేసి కేవలం రియల్ ఎస్టేట్ దందాలపైనే పూర్తి దృష్టి పెట్టారని ఆయన విమర్శించారు. పేదల భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే స్వయంగా భూ కబ్జాదారులకు సహకరిస్తూ పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఇవన్నీ జరుగుతున్నాయని ప్రతిపక్షాలు నిరూపిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆయన మండిపడ్డారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ దోపిడీకి పాల్పడుతున్న పాలకులకు రాష్ట్ర ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ నాయకులు కేవలం ఆస్తుల సంపాదనలోనే నిమగ్నమయ్యారని వారు ఆరోపించారు. ధరణి స్థానంలో తెచ్చిన కొత్త విధానాలు ప్రజలకు మేలు చేసేలా లేవు సరిగదా భూ మాఫియాకు మరింత రక్షణ కల్పిస్తున్నాయని వారు విమర్శించారు. పేదల భూములు కాపాడే వరకు బీజేపీ విశ్రమించదని రాష్ట్ర ప్రభుత్వ అక్రమాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని వారు తెలిపారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు కీలక డిమాండ్లను తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాలపై సమగ్రమైన సీబీఐ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాధనం దోచుకుంటున్న వారిని వదిలే ప్రసక్తే లేదని వచ్చే రోజుల్లో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని వారు తేల్చిచెప్పారు.

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం భేటీ
- పెండింగ్ హామీలు, కార్మిక సంక్షేమ అంశాలపై విస్తృత చర్చ

**విశాలభారతి, రామగుండం :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న హామీల అమలు కోసం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం, బొగ్గు శాఖ మంత్రి భట్టి విక్రమార్కను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై సమగ్రంగా చర్చించారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల మనుగడ కోసం నూతన బొగ్గు గనుల ప్రారంభం, మెడికల్ బోర్డు సమస్య, మారుపేర్ల మార్పు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ, కార్మికుల సొంతింటి కల సాకారం, సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటన వంటి అంశాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికారులకు సంబంధించిన పీఆర్‌పీ సమస్యతో పాటు సింగరేణి యాజమాన్యంతో ఐఆర్ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. కార్మికులకు ఇచ్చిన హామీలను నిర్ణీత కాలపరిమితిలో అమలు చేయడంతో పాటు సంస్థలో కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేసింది. ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. త్వరలో యూనియన్ ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఒక్కో సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తుందని, కార్మికులకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ తెలిపారు.

# పాలనలో తడబాటు?

**మొదటిపేజీ తరువాయి**



రాజకీయంగా పెద్ద నష్టాన్ని కలిగిస్తున్నాయి. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రాజేస్తున్నాయి. అధికార పార్టీ చేస్తున్న పొరపాట్లు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మంచి ఆయుధాలుగా మారాయి. విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యా సంస్థలు ఇబ్బంది పడుతున్నాయి. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక వారు తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపులలో కమిషన్ల దందాలు నడుస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో భూ వివాదాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. గోదావరి, కృష్ణా ప్రాజెక్టుల నీటి వాటాల విషయంలో ప్రభుత్వ విధానాలు సరిగా లేవు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన పనులపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా కూల్చివేతలు పేద మధ్యతరగతి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. హెచ్సీయూ భూములు అలాగే ఫార్మా సిటీ భూముల వివాదాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూముల వరుస వేలం పాటలు నిర్వహించడంపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి కొన్ని సందర్భాల్లో చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరీలో ప్రభుత్వం ఎన్నో నిబంధనలు పెట్టి ఇబ్బంది పెడుతోంది. పార్టీ అంతర్గత కలహాలు ప్రభుత్వ బలాన్ని దెబ్బతీస్తున్నాయి. ఉచిత విద్యుత్ పథకం అమలులో పారదర్శకత కొరవడింది. కుల గణన అలాగే బీసీ రిజర్వేషన్ల తీర్మానం కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయి. ఎస్సీ వర్గీకరణ హామీ నెరవేర్చడంలో జాప్యం జరుగుతోంది. నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల భర్తీ హామీ పూర్తిగా అమలు కావడం లేదు. యువనేతలకు స్కూల్స్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. చేయూత పింఛన్ల పంపిణీలో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. సంక్షేమ పథకాలతో రావాల్సిన మైలేజ్ కంటే పాలనా వైఫల్యాలతో వస్తున్న నష్టమే ఎక్కువగా ఉంది. ప్రభుత్వం ముందుగా విధానపరమైన సమస్యలను గుర్తించడంలో విఫలమవుతోంది. ప్రతిపక్షాలు గొంతు ఎత్తిన తర్వాతే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. ఈ తీరు ప్రజల్లో ప్రభుత్వ సమర్థతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. పరిపాలన పైన అలాగే అధికార యంత్రాంగం పైన ప్రభుత్వానికి పట్టు లేకుండా పోయింది. దీనివల్ల ప్రతి నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. ఇందుకు తాజా ఉదాహరణ 22ఏ నిషేధిత భూముల వ్యవహారం. గతంలో ధరణి పోర్టల్ తీసుకువచ్చి బీఆర్ఎస్ పార్టీ తీవ్ర మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతీ పోర్టల్ తెచ్చి అదే తప్పు చేస్తోంది. ధరణి మాటున భూ దందాలు జరిగాయని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అదే బాటలో నడుస్తున్నారు. 22ఏ నిషేధిత జాబితా వ్యవహారంతో ప్రతిపక్షాలకు భారీ ఆయుధం దొరికింది. ఈ వివాదంతో ప్రభుత్వం తీవ్రంగా ఇరుకున పడింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా తప్పులు దొర్లాయని చెప్పాల్సి వచ్చింది. ప్రజలకు క్షమాపణ చెబుతున్నామని ఆయన అనడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోంది. ఈ అంశాన్ని గట్టిగా పట్టుకున్న ప్రతిపక్షాలు మంత్రి రాజీనామా చేయాలని పట్టుబడుతున్నాయి. ఈ మొత్తం కుంభకోణంపై సీబీఐ అలాగే జ్యూడీషియల్ విచారణ జరగాలని డిమాండ్లు వస్తున్నాయి. ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి అధికారుల మీద నెపం నెట్టివేయాలని చూస్తోంది. ప్రజల దృష్టిని మళ్లించడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ ఆస్తులు పెద్ద సంఖ్యలో చేరిపోయాయి. పైగా ఆ జాబితాను ఆన్లైన్‌లో స్పష్టంగా అందుబాటులో ఉంచలేదు. ఈ తీవ్రమైన నిర్లక్ష్యం ప్రభుత్వాన్ని హైకోర్టులో అలాగే ప్రజల ముందు దోషిగా నిలబెట్టింది. కాంగ్రెస్ పార్టీ కేడర్ కూడా ఈ పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. పాత రికార్డులను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఈ సమస్య వచ్చింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అధికారులు పట్టించుకోలేదు. దీనివల్ల వేలాది ప్రైవేట్ భూములు నిషేధిత జాబితాలో చేరిపోయాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లిన సామాన్యులు తమ ఆస్తులు బ్లాక్ అయినట్లు తెలుసుకుని లబోదిబోమంటున్నారు. లక్షల కోట్ల విలువ చేసే ఆస్తులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సమస్యను పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామన్న మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. సీఎం ఇల్లు కూడా ఈ నిషేధిత జాబితాలో చేరినట్లు వార్తలు రావడం కలకలం రేపింది. మా ఆస్తుల రక్షణకు భద్రత లేదని ప్రజలు భయపడుతున్నారు. ఈ వివాదం కారణంగా హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. బంజారాహిల్స్ అలాగే జూబ్లీహిల్స్ వంటి ప్రముఖ ప్రాంతాలు కూడా ఈ జాబితాలో చేరిపోయాయి. మాదాపూర్ అలాగే గచ్చిబౌలిలోని ఖరీదైన ప్లాట్లు కూడా నిషేధ పరిధిలోకి వెళ్లాయి.

# ప్రభుత్వ ధాన్యం మాయం..!

**మొదటిపేజీ తరువాయి**




ఉప ఉత్పత్తులు కూడా మిల్లర్లకే దక్కుతాయి. కానీ నిబంధనలను ఉల్లంఘించి కొందరు మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయడం, ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అసాధారణ కార్యకలాపాలు జరుగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేసి కొందరిని అరెస్ట్ చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో రూ.132 కోట్ల ధాన్యం కాజేసిన మిల్లర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఇద్దరు మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ కేసుల్లో మరో పదకొండు మందిపై చర్యలు తీసుకున్నారు. రూ.20 కోట్ల విలువైన బియ్యం, రూ.17 కోట్ల విలువైన వాహనాలను సీజ్ చేశారు. ధాన్యం అక్రమ రవాణాకు సంబంధించి 348 మంది మిల్లర్లపై క్రిమినల్ కేసులు, 128 మందిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. అధికారులు ఎన్ని కేసులు పెట్టినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. కోర్టు ప్రక్రియ సుదీర్ఘంగా సాగడం వల్ల డబ్బు రాబట్టడం సవాల్‌గా మారుతోంది. గతంలో పర్యవేక్షణ లోపించడం వల్ల ఈ భారీ బకాయిలు పేరుకుపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించారు. మిల్లర్ల నుంచి బకాయిలను కచ్చితంగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 2025 26 ఖరీఫ్, రబీ సీజన్లలో ఇచ్చిన ధాన్యంపై ప్రత్యేక నిఘా పెట్టారు. మిల్లుల్లో స్టాక్ ఎంత ఉందో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు ముమ్మరం చేశారు. అక్రమాలు జరిగినట్లు తేలితే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా, ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి రూపాయిని రికవరీ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం వల్లనే ఇన్ని కోట్లు బకాయిపడ్డాయి. రైతులకు చెల్లించే డబ్బు ప్రభుత్వంపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగిస్తేనే ప్రభుత్వానికి నిధులు వస్తాయి. కానీ మిల్లుల్లో నిలిచిపోయిన నిల్వల వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అధికారులు ఎప్పటికప్పుడు స్టాక్‌ను తనిఖీ చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు తెస్తున్నారు. డిజిటల్ పద్ధతిలో మిల్లుల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రతి గింజ లెక్క సరిగ్గా ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. తప్పు చేసిన వారిపై ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరిస్తోంది. ఈ కఠిన చర్యల ద్వారా మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా లేదా అనేది వేచి చూడాలి. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన బకాయిలు పూర్తిగా వస్తేనే ఈ సంక్షోభం నుంచి పూర్తి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలతో మిల్లర్లలో వణుకు మొదలైంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూలుపై అధికారులు తీవ్రంగా దృష్టి సారించారు. కేవలం నోటీసులతో సరిపెట్టకుండా ఆస్తులను జప్తు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. రెవెన్యూ రికవరీ చట్టం ద్వారా బకాయిదారుల నుంచి డబ్బు రాబడుతున్నారు. ఈ మొత్తం ప్రయాణంలో రైతుల ప్రయోజనాలే అత్యంత కీలకమైనవి. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ఎలాంటి ఇబ్బంది కలగకూడదు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడాలంటే ఈ బకాయిల వసూలు ప్రక్రియ విజయవంతం కావాలి. కొందరు అవినీతి మిల్లర్ల వల్ల మొత్తం వ్యవస్థ చెడ్డపేరు తెచ్చుకుంటోంది. అందుకే ప్రభుత్వం ఈసారి రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ప్రతి మిల్లును తనిఖీ చేసి వాస్తవ నిల్వలను బయటకు తీస్తున్నారు. ఈ తనిఖీల ద్వారా అక్రమార్కుల గుట్టు రట్టవుతోంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరితే భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా ఆటోమేటిక్‌గా నియంత్రణ సాధ్యమవుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో పర్యవేక్షణ లోపాలు ఇకపై జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. గత తప్పులను సరిదిద్దుకుంటూ పకడ్బందీ విధానాలను అమలు చేస్తున్నారు. మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని సకాలంలో అప్పగించేలా కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే మిల్లుల లైసెన్సులు రద్దు చేసేలా అధికారులు చర్యలు సిద్ధం చేశారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. ఈ లక్ష్యసాధనలో విజిలెన్స్ బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న తనిఖీలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రూ.6,631 కోట్ల భారీ బకాయిలను రాబట్టడం అంత సులభం కాకపోయినా, ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. ఈ పోరాటంలో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగి ప్రజాధనం వెనక్కి వస్తేనే వ్యవస్థ గాడిలో పడుతుంది. లేకపోతే ఈ సమస్య ప్రతి సీజన్‌లోనూ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి తీసుకుంటున్న చర్యలు చారిత్రాత్మకంగా నిలుస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# కవిత ‘భూలక్ష్మి’ బాంబ్..!

**మొదటిపేజీ తరువాయి**



తెలంగాణ సమాజంలో గుణాత్మక మార్పు రావాలంటే పేదలకు భూ పంపిణీ జరగాల్సిన అవసరం ఉందన్నారు. భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదు.. అది పేద కుటుంబాలకు ఆర్థిక భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని అందించే సాధనమని పేర్కొన్నారు. భూమిలేని ప్రతి పేదింటి కుటుంబానికి ఒక ఎకరం భూమి అందించడమే ‘భూలక్ష్మి’ పథకం లక్ష్యమని వెల్లడించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి పాలనపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణలో రాక్షస రాజ్యం నడుస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు పేదల భూములను లాక్కొని పెద్దలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమలు, అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో పేదల భూములను తీసుకుంటే సహించేది లేదని అన్నారు. 22ఏ నిబంధనను ఉపయోగించి ప్రభుత్వం భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ఇందిరమ్మ కాలంలో పేదలకు కేటాయించిన వేలాది ఎకరాల భూములతో పాటు గతంలో పేదలకు అందిన భూములను కూడా తిరిగి లాక్కుంటున్నారని కవిత ఆరోపించారు. మరోవైపు భూ రికార్డులు, అక్రమ ఆక్రమణలు, ప్రభుత్వ భూముల వ్యవహారాలపై విచారణ కొనసాగుతోందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల వెల్లడించారు. కవిత విమర్శల నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హామీలు కూడా రాజకీయ చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం... భూమిలేని ఎస్సీ మహిళలకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి అందించే పథకం అమలులో ఉంది. అయితే ఈ పథకం ద్వారా ఆశించిన స్థాయిలో భూ పంపిణీ జరగలేదనే విమర్శలు గతంలో వచ్చాయి. ఇప్పుడు కవిత ప్రకటించిన ‘భూలక్ష్మి’ పథకం ఆ హామీకి మరింత విస్తృత రూపంగా కనిపిస్తోంది. గతంలో ఒక నిర్దిష్ట వర్గానికి మూడు ఎకరాల భూమి పంపిణీ హామీ ఉండగా.. ఇప్పుడు భూమిలేని ప్రతి పేద కుటుంబానికీ ఒక ఎకరం భూమి అందిస్తామని కవిత చెబుతున్నారు. దీంతో ఈ ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశం ఉంది. ఇప్పటికే భూముల అంశంపై కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన పలు ఆందోళనలు నిర్వహించింది. జూలైలో భూ పోరాటం సందర్భంగా కవితతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎన్డీటీవీ నివేదించింది. అయితే ‘భూలక్ష్మి’ పథకానికి అవసరమైన భూమి ఎక్కడి నుంచి సమీకరిస్తారు? అర్హులైన పేద కుటుంబాలను ఎలా గుర్తిస్తారు? ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున భూమి అందించేందుకు ఎంతమేర నిధులు అవసరమవుతాయి? సాగుకు అనుకూలమైన భూమినే ఇస్తారా? వంటి అంశాలపై కవిత ప్రకటనలో పూర్తి వివరాలు వెల్లడించలేదు. దీంతో ‘భూలక్ష్మి’ హామీపై రాజకీయంగా ఆసక్తికరమైన చర్చ మొదలైంది. గత ప్రభుత్వంలో అమలు కాలేకపోయిన భూ పంపిణీ హామీల నేపథ్యంలో ఇప్పుడు ప్రకటించిన కొత్త పథకాన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు.. వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసంపై ప్రతిపక్షాలు, అధికార పక్షం మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగే అవకాశం కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. భూమిలేని పేద కుటుంబాలకు ఎకరం భూమి అనే ‘భూలక్ష్మి’ హామీని కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాల్లో కొత్త అస్త్రంగా ముందుకు తెచ్చారు. అయితే ఈ హామీ కార్యరూపం దాల్చాలంటే స్పష్టమైన విధివిధానాలు, భూ లభ్యత, ఆర్థిక వనరులు, అర్హత ప్రమాణాలపై పూర్తి ప్రణాళిక అవసరం. గత భూ హామీల అనుభవాల నేపథ్యంలో ‘భూలక్ష్మి’పై తెలంగాణ ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారనేది భవిష్యత్తు రాజకీయాల్లో కీలకంగా మారనుంది. రాష్ట్ర ప్రజలు సంక్షేమ పథకాలను నిశితంగా గమనిస్తున్నారు. నాయకుల మాటలకు చేతలకు మధ్య ఉన్న తేడాను బేరీజు వేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో ఈ అంశం ప్రధాన భూమిక పోషించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రతిపక్ష నేతలు అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు సైతం ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి వ్యూహాలు రచిస్తున్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి
- మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు
- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా కేసులు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**




రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సంబంధిత వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, వెంకట్ రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ కళాశాల ప్రిన్సిపాల్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పడుతున్నయ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఎద్దేవా చేశారు. అందుకే ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా అర్ధరాత్రి సమయంలో పోలీసులను అడ్డం పెట్టుకుని ఆ విగ్రహాన్ని రహస్యంగా తొలగించారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన పాలనలో మరోసారి తన రాక్షస ప్రభుత్వాన్ని నిరూపించుకుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మెప్పుకోసం పోలీసు యంత్రాంగం ఇంత దిగజారి దొంగల్లా వ్యవహరించడం చాలా సిగ్గుచేటని హితవు పలికారు. ప్రజా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవత్‌రెడ్డి అనుకూలత కోసం పోలీసులు రాత్రికి రాత్రే దొంగల్లా వ్యవహరించాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందని సూటిగా నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన మాటలన్నీ పోలీసులు గుడ్డిగా వినకూడదని, చట్టాన్ని రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని గుర్తుచేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే కఠిన సత్యాన్ని పోలీసు అధికారులు రాజకీయ నాయకులు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కూల్చివేతను తీవ్రంగా నిరసిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను తెల్లవారేసరికి ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం గృహనిర్బంధాలు చేయడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉమ్మడి పాలన నాటి కర్కశత్వాన్ని తలపించేలా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల హక్కులను ప్రజాస్వామ్య నిరసన గళాలను అణచివేయాలని చూడడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాజీ ఎమ్మెల్యే



నన్నపునేని నరేందర్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేషన్ మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న మర్రి యాదవరెడ్డితో పాటు నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేయడం గృహనిర్బంధంలో ఉంచడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలందరినీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కేసులు పెడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉన్నారని, ఇలాంటి తుగ్లక్ చర్యలతో వారి మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దని సూచించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో ఏర్పడేది ముమ్మాటికీ కేసీఆర్ నాయతత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అప్పుడు అధికారంలోకి వచ్చాక నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టి తీరుతామని పునరుద్ఘాటించారు. ఆయన వీరోచిత పోరాటానికి చరిత్రలో శాశ్వత కీర్తిని తీసుకువస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను ముప్పు తెస్తున్నాయని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజల కోసం నిరంతరం శ్రమించిన నాయకుడి విగ్రహాన్ని తొలగించడం స్థానిక ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన అహంకార ధోరణిని మార్చుకుని తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న వారిని అణచివేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని దుయ్యబట్టారు. పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించి రాజకీయ కక్ష సాధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి కేవలం ప్రతిపక్ష నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అమరుల ఆశయాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ శ్రేణులు వెనకడుగు వేయవని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు సాగిస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ సమాజం అంతా ఈ అన్యాయాన్ని గమనిస్తోందని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలందరూ గమనించాలని కోరారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఎలాంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రాణాలనైనా సరే అర్పించడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. ఈ దుర్మార్గపు చర్యను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

## కాల్చిచంపే పద్ధతులు వద్దు

**న్యూఢిల్లీ:** మరణ శిక్ష పడిన ఖైదీలకు ఉరిశిక్ష వేసే పద్ధతిని రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ బాధ కలిగించే పద్ధతులను (విషపు ఇంజెక్షన్, కాల్చిచంపడం వంటివి) అమలు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన పిటిషన్‌ను అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని సెక్షన్ 354(5) సీఆర్పీసీ / బీఎన్ఎన్ఎస్ (5) ప్రకారం ఉరి తీయడం ద్వారా మరణశిక్ష విధించే పద్ధతి చెల్లుబాటు అవుతుందని, గతంలో 3జడ్జిల బెంచ్ (దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు) ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించడానికి పెద్ద బెంచ్‌కు పంపాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పు అంతిమం కాదని, భవిష్యత్తులో శాస్త్రీయ లేదా వైద్యపరమైన ఆధారాలు వచ్చి ప్రత్యామ్నాయ పద్ధతులు మెరుగైనవి అని రుజువైతే ఈ అంశాన్ని మళ్లీ రాజ్యాంగబద్ధంగా సమీక్షించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. అలాగే, ఉరిశిక్ష కంటే తక్కువ వేదన కలిగించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే స్వేచ్ఛ కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది.



# కేసీఆర్ చేసిన అప్పు తెలంగాణకు ముప్పు



**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని కొడుకు అల్లుళ్లు కూతుర్లకే మంత్రి ఎంపీలు ఎమ్మెల్సీ పదవులు దక్కాయని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే మహేష్‌కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని అలాగే కాంగ్రెస్ పాలనలో సీతక్క వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని గుర్తు చేశారు. ప్రజాపాలనలోనే ఉద్యమకారులకు గుర్తింపు ఇచ్చామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకులు నాడు గొర్రెలు బర్రెలు చేపలు పంపిణీ చేసి వాళ్ల పిల్లలు మాత్రం రాజ్యం ఏలేలా చేశారని మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజాపాలనలోనే ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి వినోద్‌రావుకు పదవులిచ్చారని విమర్శించారు. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబ సభ్యులకు పదవులు వేల ఎకరాల ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ దశ బాగా లేదు అందుకే తాను భట్టి సచివాలయంలో ఉన్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. అప్పుల తిప్పలను అధిగమిస్తునే మేం సంక్షేమ పథకాలు అమలుతో ముందుకెలుతున్నాము. ప్రతిపక్షంలో ఉన్న బావ బావమరుదులు కేటీఆర్ హరీష్ రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్రంలో కరవు రావాలని అఘోరా పూజలు చేతబడులు చేయించారని మరోసారి విమర్శించారు. సాధారణంగా ఊళ్లలో చేతబడులు చేసేవారిని చెట్లకు కట్టేసి కొడతారని ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ఈ ప్రజాపాలనను కాపాడుకోవాలంటే మళ్లీ పాత దొరల పాలన రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ విమర్శించారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మళ్లీ పవర్‌లోకి రావాలంటే గౌడ కులస్తుల సహకారం కావాలని కోరారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉందని కానీ గత బీఆర్ఎస్ సర్కార్ బహుజనుల అభిప్రాయాన్ని పట్టించుకోలేదన్నారు. బహుజనుల కోరిక మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వాయి పాపన్న విగ్రహాన్ని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిందన్నారు. ఇది బహుజనుల తెలంగాణ అని అన్నారు. ఇందిరమ్మ పాలన సామాజిక న్యాయం సమానమైన అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు ట్యాంక్ బండ్ కు వచ్చే ప్రతిఒక్కరూ సర్వాయి పాపన్న విగ్రహం చూసి ఆయన చరిత్ర తెలుసుకుంటారని అన్నారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. సర్వాయి పాపన్న వీరగాథను లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీలో సైతం భద్రపరిచారని సీఎం గుర్తుచేశారు. మహారాష్ట్ర వాసులకు శివాజీ మాదిరిగా తెలంగాణకు పాపన్న గౌడ్ నిలిచి ఉంటారన్నారు. విద్యతోనే తలరాతలు మారుతాయని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. రాష్ట్రంలో నేత గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ఈత తాటి చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. కుల వృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పిల్లల చదువు కోసం ఎన్ని వందల కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. పిల్లలకు క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇచ్చే బాధ్యత నాదని ఎల్కేజీ నుంచి పీజీ వరకు చదివించే బాధ్యత నాదన్నారు. మన పిల్లలు బాగుపడాలంటే చదువు ఒక్కటే పరిష్కారమని పేర్కొన్నారు. కష్టమైనా నష్టమైనా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని సూచించారు. సామాజిక న్యాయం సమాన అవకాశాలు కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని అన్నారు.

బహుజనుల హక్కులు రక్షించే బాధ్యత ప్రభుత్వం మీద ఉందని నొక్కి చెప్పారు. ప్రజల సేవే ముఖ్య లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ కాలంలో కుటుంబ పాలన విపరీతంగా సాగిందని రేవంత్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో మాత్రం సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రూ.8 లక్షల కోట్ల అప్పు భారం ఉన్నా సంక్షేమ పథకాలు ఆపకుండా కొనసాగిస్తున్నామని అన్నారు. 376వ జయంతి వేడుకల్లో పాపన్న గౌడ్ వీరత్వాన్ని ప్రజలకు చెప్పాలని కోరారు. 2029లో 117 సీట్లతో గెలుపు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. గౌడ కులస్తుల సహకారంతోనే ఈ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువు మెరుగుపరచి పిల్లల భవిష్యత్తు మార్చాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగాలని అందరినీ కోరారు.

# అగ్గిపెట్టె రావు పాపాలన్నీ తెలుసు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ మంత్రి హరీశ్ రావు నిషేధిత జాబితాలో భూముల చేరికపై చేసిన తీవ్రమైన వ్యాఖ్యలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గట్టిగా స్పందించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెడుతూ హరీశ్ రావుపై అత్యంత ఘాటుగా విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ పేరుతో జరిగిన అక్రమాలు, భూముల దోపిడీ ప్రజలందరికీ పూర్తిగా తెలుసని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందడానికే హరీశ్ రావు వివిధ రకాల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిత్యం అసత్య ప్రచారాలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల కాలంలో జరిగిన అన్యాయాలను ఒక్కొక్కటిగా సరిదిద్దే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వివరించారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడేవారికి ప్రజలే త్వరలో సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ పారదర్శక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి నిరాధార విమర్శలకు దిగుతున్నాయని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించవని తేల్చిచెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నాయకులు చేసిన పాపాలు, భూ ఆక్రమణలు అన్నీ బహిరంగ రహస్యాలే అని మంత్రి పొంగులేటి ఆరోపించారు. అధికార బలంతో సాగించిన చీకటి వ్యాపారాలు ప్రజల జ్ఞాపకాల్లో బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హరీశ్ రావును ఉద్దేశించి వ్యంగ్యంగా అగ్గిపెట్టె రావు అని సంబోధిస్తూ తీవ్ర స్థాయిలో సెటైర్లు వేశారు. ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు సృష్టించేందుకు ప్రతిపక్ష నేతలు నిత్యం కొత్త నాటకాలు ఆడుతూ నీచ రాజకీయాల



కు తెరలేపుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు పన్నినా, ఎటువంటి డ్రామాలు ఆడినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ నాయకుల గత మోసాలను ఎన్నటికీ క్షమించబోరని స్పష్టం చేశారు. వ్యవసాయ భూముల రికార్డులను ప్రక్షాళన చేస్తూ అర్హులకు పూర్తి హక్కులు కల్పించే దిశగా అధికార యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతుందని, ఎలాంటి అపోలకు తావులేకుండా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. అబద్ధాలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని కలలు కంటున్న ఆ నాయకుడి ఆశలు ఎప్పటికీ పగటి కలగానే మిగిలిపోవడం ఖాయమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోస్యం చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల పక్షాన నిలిచే సంక్షేమ ప్రభుత్వమని, ప్రతి విషయంలోనూ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని కలలు కంటున్న ఆ నాయకుడి ఆశలు ఎప్పటికీ పగటి కలగానే మిగిలిపోవడం ఖాయమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోస్యం చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల పక్షాన నిలిచే సంక్షేమ ప్రభుత్వమని, ప్రతి విషయంలోనూ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు తాము నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. నిషేధిత జాబితా కారణంగా తీవ్రంగా ప్రభావితమైన రైతులు, భూ యజమానుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అర్హులైన ఏ ఒక్క పేద కుటుంబానికి కూడా అన్యాయం జరగకుండా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. భూముల రక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి అవసరమైన నిర్ణయాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. గత పాలకులు చేసిన చట్టాల వల్ల ఇబ్బంది పడ్డ ప్రజలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల నిరాధార ఆరోపణలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, అభివృద్ధి సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారు నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. భూముల రక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి అవసరమైన నిర్ణయాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. గత పాలకులు చేసిన చట్టాల వల్ల ఇబ్బంది పడ్డ ప్రజలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల నిరాధార ఆరోపణలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, అభివృద్ధి సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారు నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ భూముల రికార్డులను ప్రక్షాళన చేస్తూ అర్హులకు పూర్తి హక్కులు కల్పించే దిశగా అధికార యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత పదేండ్ల కాలంలో జరిగిన అన్యాయాలను ఒక్కొక్కటిగా సరిదిద్దే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వివరించారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడేవారికి ప్రజలే త్వరలో సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ పారదర్శక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి నిరాధార విమర్శలకు దిగుతున్నాయని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించవని తేల్చిచెప్పారు. వ్యవసాయ భూముల రికార్డులను ప్రక్షాళన చేస్తూ అర్హులకు పూర్తి హక్కులు కల్పించే దిశగా అధికార యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత పదేండ్ల కాలంలో జరిగిన అన్యాయాలను ఒక్కొక్కటిగా సరిదిద్దే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వివరించారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేవలం రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడేవారికి ప్రజలే త్వరలో సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ పారదర్శక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి నిరాధార విమర్శలకు దిగుతున్నాయని ఆయన విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించవని తేల్చిచెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతుందని, ఎలాంటి అపోలకు తావులేకుండా అర్హులందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి హరీశ్ రావు నిషేధిత జాబితాలో భూముల చేరికపై చేసిన తీవ్రమైన వ్యాఖ్యలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గట్టిగా స్పందించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెడుతూ హరీశ్ రావుపై అత్యంత ఘాటుగా విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ పేరుతో జరిగిన అక్రమాలు, భూముల దోపిడీ ప్రజలందరికీ పూర్తిగా తెలుసని ఆయన గుర్తుచేశారు.

## ఆత్మగౌరవ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి:**

సామాజిక అసమానతలను ఎదిరించి, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఐడీఓసీ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా నిలిచి సామాన్య ప్రజల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. వెనుకబడిన, అణగారిన వర్గాలకు సమాజంలో సమాన గౌరవం, హక్కులు కల్పించాలనే పాపన్న గౌడ్ ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



చరిత్ర కేవలం ఒక వ్యక్తి జీవిత చరిత్ర మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం సాగిన మహోన్నత పోరాటానికి ప్రతీక అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు సమాజంలో సమానత్వ భావనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు గౌరవం, హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే పాపన్న గౌడ్ ఆశయాలు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని అధికారులు, గౌడ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, ప్రజల కోసం చేసిన పోరాటం, సామాజిక చైతన్యం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

# తింటున్నది నెయ్యేనా?

**మొదటిపేజీ తరువాయి**

హెచ్ ఫాస్ట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ భారీ ఆపరేషన్ నిర్వహించి కల్తీ మాఫియా గుట్టు రట్టు చేశారు. మంచి నాణ్యమైన నెయ్యి ధర ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. అదే నెయ్యిని తక్కువ ఖర్చుతో తయారు చేసి అసలు నెయ్యిలా అమ్మితే భారీ లాభాలు వస్తాయని అక్రమార్కులు భావిస్తున్నారు. నెయ్యిలో ఉండాల్సిన సహజమైన కొవ్వుల స్థానంలో చౌకైన కొవ్వులు, రసాయనాలు, కృత్రిమ నూనెలను వాడుతున్నారు. వాసన, రంగు, రుచి అచ్చం నెయ్యిలా ఉండేలా నేరస్థులు తయారు చేసే ప్రయత్నాలు చేస్తుంటారు. పైకి చూస్తే అసలు నెయ్యిలాగే ఉంటుంది కానీ లోపల ఉండేది మాత్రం ప్రమాదకరమైన పదార్థాలు మాత్రమే అవుతాయి. ముఖ్యంగా లూజ్‌గా విక్రయించే నెయ్యి విషయంలో తయారీదారు వివరాలు అస్సలు తెలియవు. ముడి పదార్థాలు ఏమిటి, ఎక్కడ తయారయ్యాయి, నాణ్యత పరీక్షలు జరిగాయా లేదా అనే విషయాలు ఎవరికీ స్పష్టంగా తెలియవు. అందుకే తక్కువ ధరకు దొరికిందని ఆశపడితే కొనుగోలుదారులు తీవ్రంగా మోసపోతున్నారు. కల్తీ నెయ్యి తిన్న వెంటనే ఏదైనా ప్రాణాపాయం రాకపోవచ్చు కానీ సమస్య అక్కడితో ఆగదు. ఇలాంటి హానికరమైన ఆహార పదార్థాలను పదేపదే తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుంది. నాణ్యతలేని కొవ్వులు జీర్ణవ్యవస్థను పూర్తిగా దెబ్బ తీస్తాయి. దీర్ఘకాలికంగా అనేక రకాల ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకు ఇవి దారితీసే ప్రమాదం ఉంది. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పట్టుబడిన ఈ భారీ మొత్తంలో నెయ్యి ఎక్కడికి వెళ్లాల్సి ఉందనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే ఎంత మార్కెట్‌లోకి వెళ్లింది, ఏయే ప్రాంతాల్లో విక్రయించారు, ఎంతమంది వినియోగదారులు కొనుగోలు చేశారనే విషయాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. నెయ్యి ఖరీదైన ఆహార పదార్థం కావడంతో తక్కువ నాణ్యత గల పదార్థాలను పంపిస్తే పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించవచ్చని మోసగాళ్లు ఆశిస్తున్నారు. ఇక్కడే సాధారణ ప్రజల ఆర్థిక బలహీనతలను కూడా కొన్ని వ్యాపార వర్గాలు తమ లాభాల కోసం ఉపయోగించుకుంటున్నాయి. తక్కువ ధరలో మంచి నెయ్యి లభిస్తుందనే భ్రమలో పడి చాలామంది ఆలోచించకుండా కొనుగోలు చేస్తుంటారు. ఆ చౌక ధర వెనుక నాణ్యత లోపం ఉందా లేదా అసలు నెయ్యే కాదా అనే విషయాన్ని ఎవరూ గమనించడం లేదు. గతంలో తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యి నాణ్యతపై దేశవ్యాప్తంగా పెద్ద వివాదం జరిగిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ ఘటన తర్వాత నెయ్యి సరఫరా, నాణ్యత, పరీక్షలపై ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాయి. హైద్రాబాద్ నగరంలో భారీగా కల్తీ సరుకు పట్టుబడటం చూస్తే ఫుడ్ సేఫ్టీ విషయంలో నిరంతర తనిఖీలు



ఎంత అవసరమో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రతిసారి మార్కెట్లో నెయ్యి కొనేటప్పుడు ల్యాబ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు కానీ కొన్ని కనీస జాగ్రత్తలు మాత్రం తప్పనిసరిగా పాటించాలి. మొదటగా లూజ్‌గా విక్రయించే నెయ్యిని కొనడం సాధ్యమైనంత వరకు పూర్తిగా నివారించాలి. ప్యాక్ చేసిన ఉత్పత్తులైతే తయారీదారు పేరు, పదార్థాల వివరాలు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు పరిశీలించాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వివరాలు కచ్చితంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయడం చాలా మంచిది. అసాధారణంగా తక్కువ ధరకు లభిస్తే మరింత అప్రమత్తంగా ఉండాలి ఎందుకంటే తక్కువ ధర ఒక్కటే నాణ్యతకు ఎప్పుడూ సర్టిఫికెట్ కాదు. పరిచయస్తులు అమ్ముతున్నారు కదా అని లూజ్ నెయ్యిని గుడ్డిగా నమ్మడం కూడా అంత సురక్షితమైన పద్ధతి కాదు. సరఫరా ఎక్కడి నుంచి వస్తుందో తెలియకపోతే నాణ్యతపై ఎవరికీ ఎలాంటి నమ్మకం కలగదు. నగరంలో పట్టుబడిన ఉదంతం ఒక ముఖ్యమైన సత్యాన్ని అందరికీ స్పష్టంగా తెలియజేస్తోంది. కల్తీ ఎక్కడ జరుగుతుందో పట్టుకోవడం అధికారుల బాధ్యత అయితే, మనం ఏం కొంటున్నామో తెలుసుకోవడం వినియోగదారుల ప్రధాన బాధ్యత. నెయ్యి పేరుతో మార్కెట్లో ఏది అమ్మినా గుడ్డిగా నమ్మకుండా జాగ్రత్త పడాలి. ఇది నిజంగా స్వచ్ఛమైన నెయ్యేనా అనే ఒక్క ప్రశ్న వేసుకోవడం మొదలు పెడితే ఈ కల్తీ దందాకు కొంతైనా అడ్డుకట్ట వేయవచ్చు. అప్రమత్తత ఒక్కటే మన ఆరోగ్యానికి ఎల్లప్పుడూ మొదటి రక్షణగా నిలుస్తుంది. ప్రభుత్వం కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆహార కల్తీకి పాల్పడే ముఠాల భరతం పట్టడానికి ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి. సమాజంలో ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలి. కల్తీ వ్యాపారాలను అరికట్టడానికి ప్రతి వినియోగదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. చట్టపరమైన శిక్షలు కఠినంగా ఉంటేనే భవిష్యత్తులో ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ఉంటాయి. లేదంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ముఠాలు మరింతగా రెచ్చిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే ఎంచుకోవాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు ఎప్పుడో చెప్పారు కానీ నేడు ఆ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే అతిపెద్ద సవాలుగా మారింది. మార్కెట్లో దొరికే ప్రతి వస్తువులోనూ ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతుందనే అనుమానం ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా నెయ్యి వంటి నిత్యవసర పదార్థాలలో మోసాలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. చిన్న పిల్లలు మొదలు కొని వృద్ధుల వరకు అందరూ ఇష్టపడే ఈ ఆహార పదార్థంలో విషం కలుపుతుంటే చూస్తూ ఊరుకోలేము. వ్యాపారులు కేవలం తమ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇలాంటి వారిపై ఎలాంటి దయ చూపకుండా చట్టపరంగా కఠినమైన శిక్షలు అమలు చేయాలి. అప్పుడే కల్తీ వ్యాపారుల గుండెల్లో భయం పుడుతుంది.

# గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్
- తరగతి గదుల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పరిశీలన
- మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం
- వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, వంటశాల, విద్యార్థుల వసతి గదులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థు లకు అందుతున్న విద్యా బోధన, భోజనం, వసతి, తాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. పాఠ్యాంశాల పై ప్రశ్నలు అడిగి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, అభ్య సన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యా యులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నిర్ణీత సమయానికి నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంటశాల, డైనింగ్ హాల్, తాగునీటి ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, ఆహార తయారీలో తాజా కూర గాయలు, నాణ్యమైన దినుసులను మాత్రమే విని యోగించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని అధికారులను ఆదేశించారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం.**

పాఠశాల తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూనే విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి నిత్యం అందుతున్న ఆహారం నాణ్యత, పాఠ శాలలోని సౌకర్యాలు, హాస్టల్ వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు నిర్ణీత సమయానికి వేడివేడిగా, నాణ్యమైన భోజనం అందించాలని వంటశాల సిబ్బందికి సూచించారు. వంటశాల, డైనింగ్ హాల్, తాగునీటి ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

**వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం.**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన వైద్యం అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిం చాలని ఆదేశించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించా లని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, ప్రిన్సిపా ల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి

- మొయినాబాద్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు
- పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్న అన్ని పార్టీల నాయకులు



**మొయినాబాద్ ఆగస్టు 18 (విశాలభారతి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల ను మొయినాబాద్ మండలంలో గౌడ సంఘం పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజల కోసం ఆయన చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ చరి త్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్య తతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, బి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, కమ్మరి యాదగిరి చారి, మల్లేష్ గౌడ్, కృష్ణ, ఎట్టాయ్య, ఎం రాజు, ఓం ప్రకాశ్, శివ, శ్రీకాంత్, విజయ్, అశోక్, భూషణ్, సురేష్, నవీన్, బంటి, గ్రామ పెద్దలు, నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## బండ్లగూడ–కిస్మత్పూర్ రోడ్డు విస్తరణకు తక్షణ చర్యలు తీసుకోవాలి




**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని బండ్లగూడ–కిస్మత్పూర్ రహదారిని తక్షణమే వెడల్పు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు కోరారు. ఈ మేరకు సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం లో జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి ను కలిసి వినతి పత్రం అందజేశారు. సరస్వతి విద్యాపీఠం పాఠశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేష్ రెడ్డి మృతి చెందగా, ఆయన కుమారుడు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన ఘటనపై నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సక్రమంగా లేకపోవడం, రోడ్డు విస్తరణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటమే ప్రమాదాలకు ప్రధాన కారణమని వారు పేర్కొన్నారు. ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభు త్వం తక్షణమే ఆదుకోవాలని, రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయే కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే చేపట్టాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై స్పందించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు నీరుడు సర్వేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించారు.

## ఇందిరానగర్ బస్తీ కరెంటు సమస్యలు పరిష్కరించాలి

- విద్యుత్ అధికారులకు బస్తీవాసుల వినతి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి 123 పరిధిలోని ఇందిరా నగర్ బస్తీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బస్తీవాసులు విద్యుత్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీవాసులు ఎస్ ఈ , డీఈ రత్నాకర్, ఏఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరానగర్ బస్తీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ సరైన విద్యుత్ సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకుడు హరీష్ గౌడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించిన ఏఈ రమేష్ ఈ విషయాన్ని ఎసీడీఈ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎస్ యి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరెంటు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బస్తీవాసులు కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ లక్ష్మణ్, శివకుమార్‌తో పాటు పలువురు బస్తీవాసులు పాల్గొన్నారు.

## గణంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు



**పినపాక, విశాల భారతి :** పినపాక మండలం గోపాల రావుపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు. సబ్బండ వర్గాల రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని గౌడ సంఘం అధ్యక్షులు పొన్నం వీరయ్య గౌడ్ అన్నారు. గ్రామ పెద్దలు ఊడుగుల రామచంద్రు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుంచి ఎదిగి, వారినే తన పోరాట శక్తిగా మలుచుకుని తెలంగాణ నేలపై స్వీయపాలనకు పునాది వేసిన అసాధారణ ప్రజాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. కార్యక్రమంలో పినపాక మండల గౌడ సంఘం అధ్యక్షులు కొంపెల్లి మల్లేష్‌గౌడ్, కొంపెల్లి సంతోష్‌గౌడ్, కొంపెల్లి రమేష్‌గౌడ్, రేసు కోటేష్‌గౌడ్, జలగం అశోక్ గౌడ్, కొంపెల్లి వెంకన్న గౌడ్‌తో పాటు గౌడ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తొలి బహుజన రాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్న గౌడ్



**మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి, మాజీ జెడ్పీటిసి జాజుల అంజయ్య గౌడ్**

**మునుగోడు విశాల భారతి**

మొఘల్ సామ్రాజ్య ఆధిపత్యాన్ని, స్థానిక జా గీర్దారులు, జమీందారులు అరాచకాలను గెరిల్లా యుద్ధతంత్రంతో ఎదురించి, గోల్కొండ కోటపై విజయ పతాకాన్ని ఎగురవేసి తొలి బహుజన రాజ్య స్థాపకుడుగా సర్దార్ సర్వార్ పాపన్న గౌడ్ నిలిచాడ ని మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి, మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య గౌడ్ అన్నారు. మంగ ళవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి కార్యక్ర మాన్ని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. సమాజంలో అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఏకం చేసి ఆయన ఒక శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించారన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు సమకాలికుడైన పాపన్నను, తెలంగాణ ప్రాంతంలో మొఘల్ అణచివేతపై తిరుగుబాటు చేసినందుకు ఆయనను తెలంగాణ శివాజీగా కొనియాడుతారన్నారు. అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నా రు. పాపన్నగౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బహుజనుల అభ్యున్నతికి, సమాజంలో సమానత్వం కోసం కృషి చేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ నాయకులు పాలకూరి నరసింహ గౌడ్, సురిగి చలపతి గౌడ్, పాలకూరి యాదయ్య గౌడ్, నకరికం టి యాదయ్య గౌడ్, అనంత స్వామి గౌడ్, మాధగోని రాజేష్ గౌడ్, అయితగోని లాల్ బహుదూర్ గౌడ్, బొడ్డు నాగరాజ్ గౌడ్, మాధగోని నరేందర్ గౌడ్, పోలగోని ప్రకాష్ గౌడ్, ఈదులకంటి కైలాస్ గౌడ్, గోపగోని పాపయ్యగౌడ్, ఐతగోని విజయ్ గౌడ్, జాజుల స్వామి గౌడ్, సురిగి నరసింహ గౌడ్, కాటం వెంకన్న గౌడ్, అనంత శ్రీను గౌడ్, జాజుల లక్ష్మయ్య గౌడ్, మాధగోని గణేష్ గౌడ్, మునుకుంట్ల గోపాల్ గౌడ్, శ్రీశైలం గౌడ్, సైదులు గౌడ్, వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధిపై జనరల్ బాడీలో కీలక చర్చ

- ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి.
- అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం పాటించాలి




**డోర్నకల్ విశాల భారతి:** డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు సమన్వయం తో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సూచించారు. మంగళవారం డోర్నకల్ మున్సిపాలి టీ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల కు అందుతున్న మౌలిక వసతులు, స్థానిక సమస్య లు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్ర తినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రామచంద్రనాయక్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగు పరచడంతో పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బం దులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రజలకు అవస రమైన ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వివిధ శాఖలకు సం బంధించిన సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే విధంగా చే పట్టాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకు మారి, వైస్ చైర్మన్ మాద లావణ్య, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 73 లక్షల ఓట్లు తొలగింపు

**హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియపై టీపీసీసీ అధ్యక్షు డు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల ఓట్లు ఉండగా, 73 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని ఆయన ఆరోపించారు. మరో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా ఉన్నాయని తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పేదలు, వలస కార్మికుల ఓట్లను సరైన క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే తొలగిం చారని ఆరోపించారు. 2002 నాటి ఓటర్ల జాబితా వివరాలను తప్పనిసరి ప్రాతిపదికగా పెట్టడం వల్ల పలువురు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 32 లక్షల 37 వేల ఓట్లు అనుసంధానం కానివిగా ఉన్నాయని, 60 లక్షలకు పైగా ఓట్లు డౌట్‌ఫుల్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు 35 వేల ఓట్లకు రసీదులు ఇచ్చినప్పటికీ, ఎన్నికల సంఘం వద్ద 13,100 మంది వివరాలు మాత్రమే ఉన్నాయని ఆయన అన్నారు. 1.60 కోట్ల ఓట్లను ప్రశ్నార్థకంగా ఎందుకు చూపించారో ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని మహేష్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడా ల్సిన బాధ్యత ఉందన్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ వర్ధంతి




**ఆర్మూర్,విశాల భారతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ నందిపేట్ ఆధ్వర్యంలో మంగళ వారంస్వాతంత్ర సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి ఘనంగా నిర్వహించా రు. నందిపేట్ మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఆయన దేశం కోసం చేసిన త్యాగం కృషిని మన మందరం మర్వకుండా ఆయన ఆశయాలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంద మహిపాల్,సెక్రటరీ గంగుల గంగాధర్,సభ్యులు గంగుల చిన్నయ్య,లోకం నర్సయ్య,గంగుల జనార్దన్,మగ్గిడి శ్రీను, జే ఏ సి గంగన్నా,భోజన్న,ఇందూర్ ఏసుదాసు,గుత్ప చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 97 రద్దు చేయాలని రద్దు చేయాలి



**ఆర్మూర్, విశాలభారతి:** పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక శాఖలోని కొనసాగిం చాలని మరియు జీవో నెంబర్ 97 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నందిపేట్ మండల కేంద్రము లో మంగళ వారం నందిపేట్ పాలిటెక్నిక్ కళాశాల వి ద్యార్థులు కళాశాల నుండి నందిపేట్ బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు .అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు ఈ ధర్నాకు మద్దతుగా ఏబీవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ మరియు బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబ్బర్ సురేష్ యువ మోర్చా సాయి విష్ణు విద్యార్థులు సంఘభావం తెలిపారు.

## భావితరాలకు స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న



**ఆర్మూర్,విశాల భారతి:** డొంకేశ్వర్ మండల కేంద్రం లో గౌడ సంఘం అద్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించా రు ఈ సందర్భంగా మండల అధ్య క్షులు దత్తాపూర్ నారగౌడ్,గౌరవ అధ్యక్షులు దశ గౌడ్ లు మాట్లాడు తూ తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం భావితరాలకు స్ఫూర్తి అని అణచివేతను ఎదుర్కొని అణగారిన వర్గాలను కలుపుకొని 12 మందితో తిరుగుబాటు మొదలు పెట్టి 12000 గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి మొగలులను ఓడించి తొలి బహుజన రాజుగా తన రాజ్యాన్ని ఏర్పాటు చేశాడని..పెద్దల మీద తిరుగుబాటు చేసి పెద్దల దానాన్ని పేదలకు పంచిన మహనీయుడు అని కొనియాడారు...పాపన్న గౌడ్ చరిత్ర ను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి బహుజనునీ పై ఉందని..తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతిక సర్దార్ సర్వాయి పాపన్న అని అణిచివేత నుండి అగ్గి రవ్వ ల దండెత్తి యుద్ధం చేసిన యుద్ధ వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు అనంతర రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గౌడ సంఘ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దత్తాపూర్ నారగౌడ్, దశ గౌడ్,భూమా గౌడ్,సుదర్శన్ గౌడ్, సాయ గౌడ్, నర్సా గౌడ్,నాగేష్ గౌడ్, మహేందర్ గౌడ్ ,సురేందర్,గౌడ్,మహేష్ గౌడ్, మురళి గౌడ్,రాము గౌడ్,సత్య గౌడ్ పాల్గొన్నారు

## శక్తి నుంచి పాలిటెక్నిక్ విద్యను తొలగించాలి

- పాలిటెక్నిక్‌ను పాత పద్ధతిలోనే కొనసాగించాలి
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ, ధర్నా
- విలీనంతో పేద విద్యార్థులపై ఫీజుల భారం పడే ప్రమాదం: పుల్లూరి సింహాద్రి




**సూర్యాపేట (విశాలభారతి):** శక్తి పథకం నుంచి పాలిటెక్నిక్ విద్యను తొలగించి, పాత బోర్డు పరిధిలోనే కొ నసాగించాలని డిమాండ్ చేస్తూ పీడీఎ స్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల నుంచి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా ఇంజ నీరింగ్ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ.. శక్తిలో పాలిటెక్నిక్‌ను ఏకపక్షంగా విలీనం చేయడాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నా రు. దీనివల్ల విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఉన్న స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థులపై అధిక ఫీజుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత పద్ధతిలోనే కొనసాగిం చాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు రిషిత, నవీనా, శ్రీవాణి, హాసిని, గాయత్రి, హరి, అమృతవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## సింగరాజుపల్లిలో ఘనంగా ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు



**దేవరుప్పుల విశాల భారతి :** మండలం సింగరాజుపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీమతి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలను గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ల కోరం అధ్యక్షులు జోగు అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి మాట్లాడుతూ,ఝాన్సీరెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. మహిళలు, పేదలు, యువత సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఝాన్సీరెడ్డి గారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని ఝాన్సీరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వెంకంపహాడ్ సర్పంచ్ మృతి కుటుంబాన్ని పరామర్శించిన రెడ్యా నాయక్



**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలం వెంకంపహాడ్ గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న (32) సోమవారం రాత్రి బైక్ ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసు కున్న డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ మం గళవారం వెంకంపహాడ్ గ్రామానికి చేరుకుని సోమన్న పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదా ర్చారు. సోమన్న మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని రెడ్యా నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉగ్గంపల్లి సర్పంచ్ యుండి అరుస్తూ పాష, మాజీ ఎంపీటీసీ గుగులోత్ వెంకన్న, అవిలయ్య, మాజీ సర్పంచ్ తప్పెట్ల వెంకన్న, తప్పెట్ల విజయ్, కోడిగంటి సతీష్, లింగయ్య, వీరన్న, కిషన్, శేఖర్, అనిల్, సురేష్, పట్ల వంశీతో పాటు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# యాచారం మండలంలో రూ.3.60కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో రోజంతా పల్లెల్లో పర్యటించిన మల్‌రెడ్డి రంగారెడ్డి**





**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రూపురేఖలు మార్చేందుకు కంకణం కట్టుకున్నానని... ఇందులో భాగంగానే రెండున్నరేళ్లలోనే రూ.700కోట్లకు పైగా నిధులు మౌలికసదుపాయాల కల్పనకు తీసుకువచ్చినట్లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఉద్ఘాటించారు. హైదరాబాద్ నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, ఇన్నాళ్లు అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో ఉండిపోయిందన్నారు. వందలకిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్, తాండూర్‌లాంటి ప్రాంతాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లాయన్నారు. 40వేల ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఈ ప్రగతి యజ్ఞం చేపట్టినట్లు మల్‌రెడ్డి వెల్లడించారు. యాచారం మండలంలో రూ.3.60కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మల్‌రెడ్డి రంగారెడ్డి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు గ్రామాల్లో పర్యటించారు. తొలుత మంతన్‌గౌరెల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే. గ్రామంలో రూ.20లక్షలతో భూగర్భడ్రైనేజీ, రూ.30లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటి గృహ స్వప్నం నెరవేర్చిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, కేశీతండాకు వెళ్లి రూ.5లక్షలతో భూగర్భ డ్రైనేజీ, రూ.5లక్షలతో సీసీ రోడ్డు, రూ.20లక్షలతో గ్రామపంచాయతీ భవనం పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి, నల్లవెల్లిలో పర్యటిస్తూ,రూ.20లక్షలతో నిర్మించిన భూగర్భడ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. నల్లవెల్లితండాలో రూ.20లక్షలతో భూగర్భడ్రైనేజీ, మరో రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. తమ్మలోనిగూడెంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డుకు, మరో రూ.20లక్షలతో భూగర్భడ్రైనేజీ, సీసీరోడ్డుకు శంకుస్థాపన చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మహిళలు, వృద్ధులతో కాసేపు ముచ్చటిస్తూ... పెన్షన్లు, ఉచిత ప్రయాణం, కరెంటులాంటి పథకాల ప్రయోజనాలను ఆరా తీశారు. చివరగా, చౌదర్‌పల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే. రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అనంతరం, రూ.75లక్షలతో వివిధ మార్గాల్లో సీసీ రోడ్లు, రూ.25లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాలకు ప్రగతి బాటలు వేస్తేనే... నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతోందని, ఇందులో భాగంగా రాజకీయాలకతీతంగా రాజీలేకుండా నిధులు మంజూరు చేస్తున్నట్లు మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ప్రజాప్రతినిధులందరూ కలిసివచ్చి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఆదర్శంగా తీర్చిదిద్దటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిలకంటి శేఖర్ రెడ్డి, మంతన్ గౌరెల్లి సర్పంచ్ కొర్ర అరవిందు నాయక్, కేసి తండా సర్పంచ్ రమేష్ నాయక్, నల్లవెల్లి సర్పంచ్ కిషన్, తమలోని కూడా సర్పంచ్ దేంది రాంరెడ్డి, చౌదర్పల్లి సర్పంచ్ కేశమోని రాజు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు అండగా ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న

- సొంత ఖర్చులతో 120 మంది రైతులకు మిర్చి నారు పంపిణీ
- సుమారు రూ.6 లక్షల విలువైన నారు అందజేత



**కురవి విశాల భారతి:** మండలంలోని ఎలుకచెట్టు తండా గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న తన సొంత ఖర్చులతో తండా రైతులకు అండగా నిలిచారు. రైతుల ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో 120 మంది రైతులకు ఉచితంగా మిర్చి నారును పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు సుమారు 5,000 మొక్కల చొప్పున అందజేయగా, మొత్తం సుమారు రూ.6 లక్షల విలువైన మిర్చి నారును పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తన తండా ప్రజలకు ఏదైనా ఉపయోగకరమైన సేవ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుగులోతు వీరన్న తెలిపారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి భారం పెరుగుతున్న నేపథ్యంలో తన వంతు సహకారంగా ఉచితంగా మిర్చి నారు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో కూడా తన వంతుగా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని గుగులోతు వీరన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఉప సర్పంచ్ గుగులోతు వీరన్నకు కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఖర్చులతో మిర్చి నారు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాలోత్ రమేష్, బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు భూక్య శ్రీను, నాయకులు భూక్య రాజు, భూక్య భాస్కర్, బానోత్ నరేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి భూక్య మల్చుర్‌తో పాటు ఎలుకచెట్టు తండా రైతులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

- "బహుజన వీరుడి ఆశయాల సాధనకు కృషి చేద్దాం" అంటూ నివాళులు
- మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్



**చౌటుప్పల్,విశాల భారతి:** బహుజన వీరుడు, స్వయంపాలన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు చౌటుప్పల్ పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అందరూ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పాపన్న గౌడ్ బహుజనుల హక్కుల కోసం, స్వాభిమానం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన తెగువ, త్యాగం నేటి తరానికి స్ఫూర్తి అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంజయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పూదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, కోఆప్షన్ సభ్యుడు పస్తం గంగా రాములు పాల్గొన్నారు. అదేవిధంగా ఉడుగు రమేష్, బత్తుల దాసు, షేక్ జానీ బాబా, పల్లె సురేందర్ రెడ్డి తదితర నాయకులు, వివిధ రంగాల గౌడ సంఘ ప్రముఖులు, గౌడ సంఘ యువజన నాయకులు, మున్సిపల్ కార్యాలయ వార్డ్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వక్తలందరూ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చివరగా "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ జయంతి వేడుకలను విజయవంతంగా ముగించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిద్దాం



**చౌటుప్పల్,విశాల భారతి:** మున్సిపల్ పరిధిలోని తంగడిపల్లి సర్దార్ సర్వాయి పాపన్న చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మగుదల పావని రమేష్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ యువ నాయకులు చెరుకు శివ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, స్వాభిమాన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు. ఈ వేడుకల్లో మునుగోడు నియోజకవర్గ గౌడ్ సంఘం నాయకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బహుజన నేతలు, పెద్ద సంఖ్యలో యువకులు హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు నివాళులు అర్పించారు.

## ఝాన్సీ రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం



**దేవరుప్పుల విశాల భారతి:** పీసీసీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి హనుమండ్ల ఝాన్సీ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరుప్పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 25 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా దావెర అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఝాన్సీ రెడ్డి ప్రజాసేవకు గుర్తుగా రక్తదాన శిబిరం నిర్వహించామని తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని, యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఝాన్సీ రెడ్డి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఆమెకు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరింత కాలం ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ సెల్‌ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**దేవరుప్పుల విశాల భారతి:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బహుజన రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ చేసిన వీరోచిత పోరాటాన్ని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దగుంటి, చిన్నగుంటి గౌడ సంఘాల నాయకులు, యువకులు, గౌడ సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి డీఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు




- జీవో 97ను రద్దు చేయాలి
- రేపు జిల్లా కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థుల పిలుపు
- విద్యార్థులను కలెక్టరేట్‌కు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- కళాశాల ఎదుట డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

**మహబూబాబాద్, జిల్లా విశాల భారతి:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడాన్ని డీఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, కోశాధికారి గూగులోతు సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనను అడ్డుకునేందుకు కళాశాల వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేయడంపై డీఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తున్న విద్యార్థులను బయటకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. "రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీం వల్ల మా మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ విద్య వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇంజినీరింగ్ చదవాలంటే మళ్లీ ఇంటర్ చదవాల్సిన పరిస్థితి వస్తోంది" అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.97 ద్వారా డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఏటీసీలతో అనుసంధానం చేయడం వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు ఉన్న ప్రత్యేకత, ప్రాధాన్యత దెబ్బతింటుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవో అమలుతో సాంకేతిక విద్యా మండలి స్వతంత్రతకు భంగం కలిగే ప్రమాదం ఉందని, ప్రత్యేక సాంకేతిక విద్యగా కొనసాగుతున్న పాలిటెక్నిక్ డిప్లొమా విద్యను సాధారణ శ్రామిక శిక్షణ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని డీఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు ఉన్న ప్రత్యేక హోదాను కాపాడాలని, సాంకేతిక విద్యా మండలి స్వతంత్రతను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డీఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. రేపు మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బానోత్ దేవేందర్, కేసముద్రం మండల నాయకులు అభిరామ్, షోయబ్, నవీన్, సంతోష్, తరుణ్, అజయ్, వినయ్‌తో పాటు పలువురు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి



**చౌటుప్పల్,విశాల భారతి**

మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో మంగళవారం తెలంగాణ వీర యోధుడు శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్, సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్‌గౌడ్ అధ్యక్షత వహించారు. అదేవిధంగా గీత కార్మిక గౌడ సంఘం వద్ద జరిగిన జయంతి కార్యక్రమానికి భీమగోని మల్లేశం గౌడ్ ఆధ్వర్యం వహించారు.

**మద్యం, డ్రగ్స్ రహిత గ్రామమే లక్ష్యం**

జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చౌటుప్పల్ ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆంటీ డ్రగ్స్ మరియు బెల్ట్ షాపుల నిషేధ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యపాన విక్రయాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. త్వరలో గ్రామంలోని అన్ని షాపుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అమ్మకాలు జరిపితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీస్ సందీప్ గారు, ఆంటీ అండ్ డ్రగ్స్ బెల్ట్ షాపుల నిషేధ కమిటీ సభ్యులు, నల్ల జయప్రద, ముద్దం మంజుల, భీమగోని మల్లేశం గౌడ్, పెండెం లక్ష్మి, దొడ్ల సెట్టయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, పల్సం అంజయ్య గౌడ్, బొమ్మని సత్తయ్య గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, అంతటి జంగయ్య గౌడ్, బొమ్మని బాలరాజ్ గౌడ్, సుర్వి దాస్ గౌడ్, గంగాపురం పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యత గల ఉపసర్పంచ్ రోడ్డు భద్రత మరమ్మతులు

- రోడ్డు మరమ్మత్తుల్లో కార్మికుడిగా ఉపసర్పంచ్ పొక్కుల రవి
- గ్రామ పంచాయతీ అభివృద్దే మా లక్ష్యం



**బూర్గంపాడు /విశాల భారతి:** మేజర్ గ్రామ పంచాయతీ మొరంపల్లి బంజర గ్రామ అభివృద్ధికి ఉప సర్పంచ్ పొక్కుల రవి సేవలు అమోఘం. పారిశుద్ధ్య పనుల్లో కార్మికుడిగా, రోడ్డు భద్రత మరమ్మతు పనుల్లో శ్రామికుడిగా, ప్రజా సేవలో సేవకుడిగా తనను నమ్మిన ప్రజల కోసం ఉపసర్పంచుగా అహర్నిశలు కష్టపడుతూ ప్రజల మనసును గెలుచుకున్న నాయకుడు మన ఉపసర్పంచ్ పొక్కుల రవి. ఇటీవలె కాలంలో పదవులు రాగానే ప్రజలను మరిచే నాయకులను చూసాం. పదవి కాదు ప్రజల శ్రేయస్సు ముఖ్యం అనే నాయకుడు మన ఉప సర్పంచ్ పొక్కుల రవి. మొరంపల్లి బంజర రామాలయం గుడి సమీపంలో రోడ్డుపై ప్రమాదకర గుంతలు ఏర్పడటంతో ఉపసర్పంచ్ రవి, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ప్రమాదకరమైన గుంతలను తానే స్వయంగా మరమ్మత్తులు చేసి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించి అందరి మనసు దోచుకున్నాడు.దీంతో ఉప సర్పంచ్ పొక్కుల రవి సేవలను గ్రామపంచాయతీ ప్రజలు అభినందిచారు. వర్షాకాలం దృష్ట్యా వరదలు రోడ్లపై ప్రవహించకుండా డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను కాపాడుటంలో గ్రామ పౌరుడిగా తన కర్తవ్యాన్ని నెరవేరిచాడు.ఇటువంటి సేవ గుణం కలిగిన నాయకుడు ప్రతి గ్రామపంచాయతీలో ఉండాలని కోరుకుందాం. పదవి అంటే బాధ్యత, ప్రజలకు భరోసా కలిగించే నాయకులను ఎన్నుకుందాం. మొరంపల్లి బంజర ఉపసర్పంచ్ పొక్కుల రవి పలు గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలవాలని, అంచలంచెలుగా ఎదిగి మరింత ప్రజా సేవ చేయాలని ఈ సందర్భంగా కోరుకుందాం.

## చెక్ బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి ఆరు నెలల జైలు

- రూ.13 లక్షల చెక్ బౌన్స్ కేసులో మహిళా ఉపాధ్యాయురాలికి శిక్ష
- కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సంచలన తీర్పు
- బాకీ మొత్తం చెల్లించకుంటే మరో నెల రోజుల అదనపు శిక్ష



**కోదాడ (విశాలభారతి):** రూ.13 లక్షల చెక్ బౌన్స్ కేసులో నిందితురాలైన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుంకర (గోపతి) నాగేంద్రమ్మకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ, కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భవ్య మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన ఒక్కవంతుల మట్టపల్లి రావు వద్ద నాగేంద్రమ్మ తన కుటుంబ అవసరాల నిమిత్తం రూ.13 లక్షలు అప్పుగా తీసుకున్నారు.ఆ అప్పు తీర్చే క్రమంలో ఆమె బాధితుడికి చెక్ ఇవ్వగా, దానిని బ్యాంకులో జమ చేసినప్పుడు ఖాతాలో తగినంత నగదు లేకపోవడంతో అది తిరస్కరణకు గురైంది. దీంతో బాధితుడు తన న్యాయవాది బెల్లంకొండ గోవర్ధన్ ద్వారా లీగల్ నోటీసు పంపినా, నిందితురాలి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నాగేంద్రమ్మకు ఆరు నెలల జైలు శిక్ష విధించారు. బాకీ మొత్తాన్ని చెల్లించని పక్షంలో, అదనంగా మరో నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుని తరపున న్యాయవాది బెల్లంకొండ గోవర్ధన్ వాదనలు వినిపించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

- అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు పాపన్న గౌడ్
- కొయ్యడ శేఖర్ గౌడ్ టిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్



**చౌటుప్పల్,విశాల భారతి:** సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ చౌరస్తా వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ,"పాపన్న గౌడ్ అణగారిన వర్గాల కోసం చేసిన సేవలు, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి. ఆయన ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి యువతకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొని పాపన్న గౌడ్ సిద్ధాంతాలను స్మరించుకున్నారు.

# డిస్ట్రిబ్యూటరీ కాలువలను వెంటనే పూర్తి చేయాలి

- భూ నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదు
- మీ అవినీతి నాటకాలు అందరికీ తెలుసు
- రాజకీయ క్రీడలు ప్రజలు గమనిస్తున్నారు
- సీతారామ, సీతమ్మ సాగర్ పనుల పరిశీలనలో భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, నున్న నాగేశ్వరరావు.



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు ఇచ్చేందుకు ఫీల్డ్ చానల్స్, డిస్ట్రిబ్యూటరీ కాలువలను వెంటనే పూర్తి చేసి ఈ సాగులోనే రైతులకు నీళ్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావులు అన్నారు. మంగళవారం మండలంలోని గోదావరి నదిపై నిర్మాణం చేపడుతున్న సీతమ్మ సాగర్, సీతారామ పనులను ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులతో కలిసివారు పరిశీలించారు. సీతమ్మ సాగర్ కు మొన్నటిదాకా అనుమతులు లేవన్న కారణాన్ని చూపి ప్రాజెక్టు పనులు చేపట్టకుండా కాలయాపన చేశారన్నారు. నేడు ప్రాజెక్టు నిర్మించేందుకు కోర్టు నుండి క్లీన్ చిట్ లభించిందని ఈ నేపథ్యంలో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మేరకు నిధులను ఏకకాలంలో కేటాయింపులు చేసి వెంటనే పనులు చేపట్టి వీలైనంత తొందరలో పూర్తి చేయాలన్నారు.

**భూ నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించేది లేదు :**

గోదావరిపై నిర్మాణం చేపడుతున్న సీతారామ ప్రాజెక్టుతోపాటు బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ కాలువ వద్ద నిర్మిస్తున్న మారేళ్లపాడు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో అన్యాయం చేస్తే సహించేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మారేళ్ల పాడు లిఫ్ట్ ఇరిగేషన్ కు భూములు తీసుకొని రైతులకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని సిపిఎం పార్టీ ప్రశ్నిస్తుందన్నారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు తీసుకుని కాలువలు తవ్వి రైతుకు నీళ్లు ఇచ్చేందుకు తమ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. మారేళ్లపాడు ప్రాజెక్టు ఆగస్టు 15 లోపు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పాడన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తే మారెళ్ళ పాడు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయ్యేందుకుమరికొన్ని నెలలు పట్టేలా ఉన్నాయన్నారు. ఇప్పటికే తుమ్మల చెరువు కింద రైతులు నాట్లేసుకొని ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తుమ్మల చెరువు కింద రైతులకు సాగునీరు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

**21 ఏండ్ల కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులు తీవ్ర జాప్యానికి గురయ్యాయన్నారు :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని కుమ్మరిగూడెం గోదావరి నదిపై నిర్మాణం చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం 11 ఏండ్లు, బిఆర్ఎస్ ప్రభుత్వం మరో 10 ఏళ్లు కాలయాపన చేస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు చేశాయని మచ్చ వెంకటేశ్వర్లు, నున్న నాగేశ్వరరావు లు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మెట్రో కి నిధులు కేటాయిస్తుందని, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రయోజనం వనగూరు ఎందుకు ఉపయోగపడే సీతారామ, సీతమ్మ సాగరకు నిధులు ఎందుకు కేటాయించట్లేదని వారి ప్రశ్నించారు. ఓ పక్కన కాంగ్రెస్ ప్రభుత్వం తమ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున నిధులు కేటాయించి విద్య ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని చెప్పిన మాటలు కేవలం నీటి మీద రాతలుగా మిగిలిపోయాయన్నారు. గోదావరిన దిపై నిర్మాణం చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహించి రైతులకు, ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు ఉద్యమిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన మేరకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, అన్నవరపు కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై విక్రం జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, లిక్కి బాలరాజు, బండి పద్మ, ఎర్ర శ్రీనివాసరావు, మడిపల్లి గోపాలరావు, మెరుగు సత్యనారాయణ, యలమంచి వంశీకృష్ణ, గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు ,భూక్యా రమేష్, నిమ్మల వెంకన్న, మర్మం చంద్రయ్య, కొండబోయిన వెంకటేశ్వర్లు, పాయం నరసింహారావు, సర్గం బాలనర్సయ్య, వాసిరెడ్డి వరప్రసాద్. కుమ్మరిగూడెం మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, అశోక్ రెడ్డి, శంబి రెడ్డి, సాంబశివరావు, దండి రాములు, మోకాళ్ళ రమేష్, పాయం విజయ, బొద్దు రాములు, బొమ్మరాతి రామయ్య, మోహన్ రెడ్డి, నరసింహాచారి, పాయం జానకమ్మ, కొడిశాల రాములు, పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు

**ఎల్‌బీనగర్‌లో విగ్రహానికి పూలమాలలు వేసిన కళ్లెం నవజీవన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. సర్వాయి పాపన్న గౌడ్ బలహీన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడారని కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గోవిందచారి, బీజేపీ నాయకులు రమణ, జిల్లా మహిళా నాయకురాలు పార్వతి, నాయకులు అరుణ్, బీజేవైఎం హయత్‌నగర్ ప్రధాన కార్యదర్శి అభిలాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవలను గుర్తించి మాజీ కార్పొరేటర్‌కు ఘన సన్మానం

**స్వాతంత్ర్య వేడుకల్లో కళ్లెం నవజీవన్ రెడ్డిని సత్కరించిన కాలనీవాసులు**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీ 1, సూర్యనగర్ కాలనీ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా డివిజన్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు కాలనీవాసులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. కళ్లెం నవజీవన్ రెడ్డి పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేశారని తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి గత ఐదేళ్లలో ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన హయత్‌నగర్ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. గత ఐదేళ్లలో ప్రజా సంక్షేమం, డివిజన్ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పనిచేశానని తెలిపారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లోనూ ప్రజలతో కలిసి ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి సహకరించిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గంగానే శ్రీనివాస్, సూర్యనగర్ కాలనీ ఈస్ట్ అధ్యక్షుడు ఐతగొని యాదగిరి గౌడ్, సూర్యనగర్ కాలనీ 1 వెస్ట్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌తో పాటు సంక్షేమ సంఘాల సభ్యులు యాదగిరి రెడ్డి, దశరథ రెడ్డి, యాదగిరి చారి, చంద్రారెడ్డి, విజయ్, రాజవర్ధన్ రెడ్డి, సంపత్, జ్యోతిశ్వర్ గౌడ్, అమృతారెడ్డి, రామలింగాచారి, వెంకట్ రెడ్డి, కోటి నాయక్, చక్రవర్తి గౌడ్ తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# స్వాతి నక్షత్ర పూజలకు భక్తులు తరలిరావాలి

**గౌరెల్లి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**




**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** గౌరెల్లి గుట్టపై కొలువైన శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ నెల 19న ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

**అభిషేకం, సుదర్శన హోమం**

దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించడంతో పాటు సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

**అందరికీ ఆలయ కమిటీ ఆహ్వానం**

ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామ ప్రజలతో పాటు అన్ని పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన సంఘాల నాయకులు, యువకులు, భక్తులు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లూరి రాజు కోరారు. స్వామివారి సన్నిధిలో జరిగే పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి లక్ష్మీనరసింహస్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను దేవాలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. చైర్మన్ నెల్లూరి రాజుతో పాటు వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పాలి



- నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం

**భద్రాద్రి జిల్లా ప్రతినిధి :విశాలభారతి**

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించడంతో పాటు నూతన పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ లేబర్, ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్, పరిశ్రమలు, మైన్స్, జియాలజీ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని తెలంగాణ బహుజన ఐక్య వేదిక నాయకులు కోరారు. మణుగూరులోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు వెళ్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామిని మంగళవారం పాల్వంచ సీ కాలనీ గేట్ వద్ద బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏపీ స్టీల్, ఎన్ఎండీసీ, కేటీపీఎస్ పాత ప్లాంట్లు మూతపడటంతో నిరుద్యోగ సమస్య పెరిగిందని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసి పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఇండస్ట్రియల్ కారిడార్, ఆటోనగర్ వంటి పారిశ్రామిక వసతులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేటీపీఎస్ ఏ, బీ స్టేషన్లు ఉత్పత్తి కాలాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో తొలగించిన పరిశ్రమల యార్డులో 2×800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్ఎండీసీ ప్లాంట్, ఏపీ స్టీల్‌ను పునరుద్ధరిస్తే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఇప్పటికే ఈ ప్రాంతంలో అందుబాటులో ఉన్నందున ప్రభుత్వంపై నిర్మాణ భారం కూడా తగ్గుతుందని వివరించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామిని నాయకులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం, సెక్రటరీ శనగ రామచందర్‌రావు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, మెంటం బలరాం, జూపూడి ప్రభాకర్, భూక్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం

**ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

22ఏ నిషేధిత జాబితాకు సంబంధించి ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22ఏలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22ఏ జాబితా, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు, భూ రికార్డుల సవరణ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 22ఏ జాబితాలో నమోదైన భూములకు సంబంధించి పాత, కొత్త సర్వే నంబర్లు, భూముల విభజన, సరిహద్దులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సర్వే రికార్డులు, ఇతర ప్రభుత్వ రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా అన్ని రికార్డులను పరిశీలించిన తర్వాత నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**యూఎల్‌సీ భూములపై ప్రత్యేక పరిశీలన**

పట్టణ ప్రాంతాల్లో గతంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) పరిధిలో ఉన్న భూముల రికార్డులను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా జీవో 765 ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, డిప్రెషన్, విముక్తి తదితర అంశాలను పరిశీలించి అర్హత ఉన్న భూములపై నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



**హెచ్ఎండీఏ పరిధిలోనూ పరిశీలన**

హెచ్ఎండీఏ పరిధిలోని భూముల రికార్డులను కూడా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు, చట్టపరంగా 22ఏ పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే జాబితాలో ఉంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "జెన్యూన్ పట్టా భూమి పొరపాటున 22ఏ జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా త్వరలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం" అని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, పాత సర్వే వివరాలు, సరిహద్దులు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డుల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలి

**15వ రోజుకు చేరుకున్న ఆయుష్ నిరవధిక సమ్మె**




**ముషీరాబాద్, విశాల భారతి:** తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్లు, విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. రామంతపూర్ లోని జె ఎస్ పి ఎస్ ఆయుష్ మెడికల్ కాలేజ్ వద్ద జరిగిన నిరసన దీక్షలో డాక్టర్లు శ్రేయ రాయ్, వినయ్, మహేశ్వరి, భావన, రిషిక మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్టైఫండ్ ను పెంచాలని అనేక మార్లు మంత్రులు అధికారులను కలిసిన న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలల్లో జరుగుతున్న నిరసనలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం స్టైఫండ్ పెంపుపై తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సేవ చేస్తున్న ఆయుష్ వైద్యుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. తమ సేవలకు తగిన గౌరవం సమానత్వం న్యాయం దక్కాలని 15 రోజులుగా పోరాటం చేస్తున్నామని వెంటనే పెంపుపై జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# శక్తి పాలసీని రద్దు చేయాలి

**పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ రెండో రోజు ధర్నా**




**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** శక్తి పాలసీని రద్దు చేయడంతో పాటు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ కళాశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని సంజయ్‌గాంధీ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట రెండో రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు వినోద్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను రద్దు చేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అందుతున్న ఉపకార వేతనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. శక్తి పాలసీ పేరుతో పాలిటెక్నిక్ విద్యను ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని నాయకులు అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లపై రేపు స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని గుండె శివకుమార్, వినోద్ నాయక్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో వేలాది మంది విద్యార్థులతో జాతీయ రహదారిని దిగ్బంధం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, హరీష్, శశి, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిఖిల్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది

**శంషాబాద్‌లో ప్రజా చైతన్య బస్సు యాత్ర సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ఐదు రోజుల ప్రజా చైతన్య బస్సు యాత్ర మంగళవారం శంషాబాద్‌కు చేరుకుంది. అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, పేదల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని జంగయ్య విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను కేంద్రం విడనాడాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థులు నష్టపోతున్నారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మతం, కులం పేరుతో విభజన రాజకీయాలు కాకుండా ఉద్యోగాలు, ఉపాధి, విద్య, వైద్యం, రైతుల సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని జంగయ్య డిమాండ్ చేశారు. పెన్షన్లు, రైతుల సమస్యలు, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ పరిసరాల్లో భూసేకరణ విషయంలో రైతులకు నష్టం కలగకుండా చూడాలని అన్నారు.

**ఆగస్టు 21న భారీ బహిరంగ సభ**

ఆగస్టు 21న అబ్దుల్లాపూర్‌మెట్ భూపోరాట కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జంగయ్య పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, బుద్ధుల జంగయ్య, ఓరుగంటి యాదయ్య, ఎం. ప్రభులింగం, ఆర్. యాదగిరి, పి. శివకుమార్, దత్తునాయక్, వంశీ, వర్ధన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల స్మశానవాటిక ఆధునీకరణకు చర్యలు

**సమస్యలను వివరించిన గజ్జి భాస్కర్ యాదవ్.. అభివృద్ధికి జోనల్ కమిషనర్ హామీ**





**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని బాగ్ హయత్‌నగర్‌లో ఉన్న మాదిగ సంక్షేమ సంఘం స్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ఐఏఎస్ హామీ ఇచ్చారు. స్మశానవాటిక శిథిలావస్థకు చేరుకోవడంతో ఆధునిక వసతులతో అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా బాగ్ హయత్‌నగర్‌లోని మాదిగల స్మశానవాటికలో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. స్మశానవాటికను ఆధునిక వసతులతో అభివృద్ధి చేసి, ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కోరినట్లు చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ వికాస్ మహతో మాట్లాడుతూ.. స్మశానవాటిక ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. ఆధునిక వసతులతో స్మశానవాటికను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు ప్రాధాన్యతనిస్తారని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు గజ్జి భాస్కర్ యాదవ్ తెలిపారు. స్మశానవాటిక అభివృద్ధికి హామీ ఇవ్వడంతో హయత్‌నగర్‌కు చెందిన మాదిగ సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానికులు, హయత్‌నగర్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు మంత్రి అభినందనలు

- 2 వేల కోట్లు తో అదనంగా 65 ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు
- విద్యార్థులకు నెలకు 2000 స్టైఫండ్
- విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషికి మంత్రి అభినందించారు

**భద్రాద్రి ప్రతినిధి :విశాలభారతి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ కేంద్రాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను పరిశీలించి అభినందించారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంత్రి వివేక్ వెంకటస్వామి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇప్పటికే సుమారు రూ.2 వేల కోట్లతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏటీసీ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి అదనంగా 65 ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఏటీసీ కేంద్రాలు మంచి అవకాశాలుగా మారనున్నాయని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఇక్కడే నేర్చుకునే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. మణుగూరు ఏటీసీ కేంద్రంలో విద్యార్థులు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న పాత పరికరాలను వినియోగించి ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ విద్యార్థులు రాష్ట్రంలోని ఇతర ఏటీసీ కేంద్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తారని అన్నారు. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఏటీసీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైఫండ్ అందిస్తున్నట్లు చెప్పారు. మణుగూరుకు ఏటీసీ కేంద్రం తీసుకురావడంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పట్టుదలతో కృషి చేశారని మంత్రి అభినందించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జపాన్, జర్మనీ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 22న జపాన్ పర్యటనకు వెళ్లనున్నానని, జపాన్‌తో ఉద్యోగాలపై ఒప్పందం కుదిరితే సుమారు ఐదు లక్షల వరకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలు, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. మణుగూరు ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలు యువతలోని సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. మణుగూరు ఐటీఐకి రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా అధ్యక్షురాలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిలువ నీడ లేక అధికారులకు అర్జీ

- డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి ఆదుకోండి
- అద్దెలు కట్టలేక ఓ నిరుపేద కుటుంబం అవస్థలు
- కంటతడి పెట్టిస్తున్న సమస్యల వలయం
- రెక్కాడితే కానీ డొక్కాడని ఓ నిరుపేద కుటుంబం అరణ్య రోదన



**భద్రాచలం, విశాల భారతి;** భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఓ నిరుపేద కుటుంబం అద్దెలు కట్టలేక వీధిన పడే పరిస్థితి కనిపిస్తున్న నేపద్యం తారసపడుతుంది. బండోజు నాగమణి భర్త, భార్య, అత్త జీవనం సాగిస్తున్నారు. నిరంతరం కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో తలదాచుకుంటున్న వీళ్ళకు సెంటు భూమి గానీ నివాసం ఉండే గృహముగాని లేకపోవడం వలన కూలి పనులతో అద్దెలు కట్టి బతికేందుకు బ్రతుకు భారంగా మారింది. జీవనం దిన దిన గండంగా మారింది. కూలి తో వచ్చిన డబ్బులు రోజువారి దిన సరుకులకే సరిపోవటం అర్థాకలి, నిరాశ, నిస్పృహల మధ్యన ఒక నిరుపేద కుటుంబం నలిగిపోతుంది. ఒకపక్క ప్రభుత్వం నిరుపేదల పరిపాలనని చెప్తున్న తరుణంలో రాజుపేట కాలనీలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నిరుపేద కుటుంబాన్ని చూసి ఎవరైనా బాధపడక తప్పదు స్వతంత్రం వచ్చిన నేటికీ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పరిస్థితుల్లో కూడా ఇటువంటి నిరుపేద కుటుంబాలు ఉండటం అనేది ప్రభుత్వాల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు ఇప్పటికైనా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఇటువంటి నిరుపేద కుటుంబాన్ని ఆదుకునే చొరవ చూపాలి ఎండిపోయిన బతుకులతో బండ బారిన జీవితాలు అనుభవిస్తున్న బండోస్ నాగమణి కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని అర్జీ పెట్టుకుంటుంది అధికారులు తక్షణమే ఆమె అనుభవిస్తున్న పేదరికాన్ని పరికరంలోకి తీసుకొని డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి అన్నివేళలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



**భద్రాద్రిజిల్లా ప్రతినిధి ,విశాలభారతి :** ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు.ప్రత్యేకంగా ప్రాపర్టీ, దొంగతనం కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను గుర్తించాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి నమోదైన ఎన్డీపీఎస్ కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, ఇతర విభాగాల నిర్వహణను పరిశీలించిన ఎస్పీ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించండి



**పాల్వంచ విశాల భారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి డీ. సీ.యమ్.యస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలోమంగళవారం పాల్వంచ సంజయ్ నగర్ కు విచ్చేసిన యం.పీకి విపతిపత్రం సమర్పించిన చారుగుండ్ల వెంకటేశ్వర్లు, శనగ రామచందర్ రావు, భూక్య శంకర్.గత విద్యాసంవత్సరంలోనే జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజురైనా నేటికి విద్యాలయం ప్రారంభానికి నోచుకోలేదని ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం లో తెలిపారు.స్పందించిన యంపి విద్యాలయం ప్రారంభానికి సింగరేణి స్థలం చూస్తున్నామని, త్వరలో విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించుటకు చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండం వెంకన్న గౌడ్, వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సెకండ్ బ్యాంకు కాలనీ, శాంతినగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**విశాలభారతి:** గత 30 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక, డ్రైనేజీ మరియు రోడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న శాంతినగర్‌లోని సెకండ్ బ్యాంకు కాలనీలో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. కొండ దంపతుల ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి గారు మంగళవారం ఉదయం ఈ కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. దశాబ్దాల కాలంగా తమ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల కొరతను దృష్టిలో ఉంచుకుని, ఈ పనులను తక్షణమే ప్రారంభించేలా చొరవ తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు బొడ్ల రవీంద్రనాథ్, కె.వి. గోపాల్ రావు, దయాకర్ రావు, సతీష్, నూక శ్రీనివాస్ తదితరులు ప్రత్యేకంగా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి గారిని కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం కావడంతో ఏళ్లనాటి సమస్య తొలగిపోతుందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# జాయ్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత.. మహిళ మృతిపై బంధువుల ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపణ








**రాజేంద్రనగర్, విశాల భారతి :** అత్తాపూర్ పరిధిలోని జాయ్ హాస్పిటల్ వద్ద మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జ్వరంతో ఆస్పత్రిలో చేరిన 28 ఏళ్ల మహిళ చికిత్స పొందుతూ మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. స్థానికంగా నివాసం ఉండే శ్రీలత (28)కు సోమవారం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు అత్తాపూర్ సమీపంలోని జాయ్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఆస్పత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నామని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే రాత్రి సమయంలో శ్రీలత ఆరోగ్య పరిస్థితి విషమించిందని చెబుతూ ఐసీయూకు తరలించారు. కొద్ది సేపటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అయితే సాధారణ జ్వరంతో ఆస్పత్రిలో చేరిన శ్రీలత కొద్ది గంటల్లోనే మృతి చెందడంపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం, సరైన సమయంలో మెరుగైన వైద్యం అందించకపోవడం వల్లే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం. శ్రీలత మృతికి అసలు కారణం ఏమిటన్నది వైద్యపరీక్షలు, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# జయమ్మ కాలనీలో పగిలిన తాగునీటి పైప్‌లైన్





**తక్షణ మరమ్మతులకు డిమాండ్**

**పాల్వంచ విశాల భారతి:** 42వ డివిజన్ పరిధిలోని జయమ్మ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. జయమ్మ కాలనీ నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో, జయమ్మ కాలనీకి చెందిన దామిరెడ్డి కాంత్ కుమార్ ఇంటి సమీపంలో పైప్‌లైన్ దెబ్బతినడంతో తాగునీరు వృథాగా పోతోంది. రోడ్డుపైకి నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు పెద్ద మొత్తంలో వృథాగా పోతుండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి పగిలిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అత్యవసరంగా స్పందించి, రోడ్డుపైకి నీరు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీటి వృథాను అరికట్టాలని జయమ్మ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్ ఎన్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**ఎన్ ఎన్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ నాయిని నవీన్ రెడ్డి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

యాచారం మండల పరిధిలోని, గడ్డ మల్లయ్య గూడెం, గున్ గల్ , ధర్మన్నగూడ, చిన్నతుండ్ల, గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠశాల బ్యాగులు పంపిణీ చేసిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి. అనునిత్యం ప్రజల కోసం ఆలోచించే నాయకురాలు ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ నాయిని లహరి నవీన్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఎల్లవేళలా తోడుంటానని అండగా నిలుస్తానని, ముందు ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు ఫౌండేషన్ ద్వారా విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో , చిన్నతుండ్ల సర్పంచ్ అంబోజి రమేష్, గడ్డ మల్లయ్య గూడ సర్పంచ్ అచ్చన్నమంగ జంగయ్య, బాసాని బుచ్చిరెడ్డి గున్గల్ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి, ధర్మన్నగూడ సర్పంచ్ పండుగ పద్మ బాల్ రాజ్ ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ సాధనకై కదం తొక్కిన విద్యార్థి లోకం

**భద్రాచలం : విశాల భారతి;**

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షతన సబ్ కలెక్టరేట్ ధర్నా విద్యార్థులతో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ₹10,814 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, ఫీజులు చెల్లించలేదనే పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాలల్లోనే నిలిపివేసి తీవ్రంగా వేధిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు అందలేదని విమర్శించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపడం అన్యాయమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు కాగా, వాటిని విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలు చేయడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు,మెమోలు, ఇతర విద్యా పత్రాలను కళాశాలలు తమ వద్ద ఉంచుకుని విద్యార్థులను, తల్లిదండ్రులను వేధిస్తున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు తమ చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువును బాధ్యతగా చూడాలి తప్ప, ప్రైవేట్ కళాశాలల ఆర్థిక ప్రయోజనాలకు విద్యార్థులను బలిచేయకూడదని అన్నారు.






# ఎస్సి, ఎస్టి, బిసి జాయింట్ సెక్రెటరీగా రవి నాయక్ నియామకం

**సికింద్రాబాద్, విశాల భారతి :** ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీ సెల్ సికింద్రాబాద్ అధ్యక్షులు మంద జగన్ ఆధ్వర్యంలో తార్నాకకు చెందిన రవి నాయక్ను సెల్ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ఆయా వర్గాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తన పై నమ్మకం ఉంచి జాయింట్ సెక్రెటరీ గా బాధ్యతలు అప్పగించిన మంద జగన్ కు నూతనంగా నియమితులైన రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, ప్రధాన కార్యదర్శి గుండెల్లి మధుకర్, ఉండిటి సచిన్, వైస్ ప్రెసిడెంట్ జానకిరామ్, ఎండి మస్తాన్ బాబా, చిలం సాయి యాదవ్, జింకల మల్లేష్, ఎండి. అక్బర్, జింకల మల్లేష్, అమర్ బాన్సావ్డే, ఎం.డి. కాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో ఎంపీ రఘురాం రెడ్డి ఆకస్మిక తనిఖీ

**మందుల కొరత, సౌకర్యాలపై ఆరా. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**



**కొత్తగూడెం:విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్)తో పాటు జనరల్ వార్డును పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు మరియు ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు .ఈ తనిఖీ సమయంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. మందుల స్టాక్‌కు సంబంధించిన వివరాలపై ఆరా తీయగా, ఇటీవలె బదిలీపై వచ్చానని అక్కడ అందుబాటులో ఉన్న ఒక మహిళా వైద్యురాలు సమాధానమిచ్చారు. ఆస్పత్రిలో మందుల కొరత ఉందంటూ తనకు పలు ఫిర్యాదులు అందాయని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఎంపీ అధికారులను ఆదేశించారు.

# కేంద్ర పథకాల అమలుపై దిశా కమిటీ సమీక్ష

**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.. అర్హులైన ప్రజలకు పథకాల ఫలాలు అందాలి**






**భద్రాద్రి ప్రతినిధి:విశాల భారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కేంద్ర పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు సూచించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి తదితర రంగాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అలాగే కేంద్ర నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగించి పనులను పూర్తి చేయాలని అధికారులు కోరారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల అమలును అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఎంపీలు రామ సహాయం రఘురామ్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, కొత్తగూడెం మేయర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బడుగుల రాజ్యాధికారం దిశగా పయనించాలి

**బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**



**ముషీరాబాద్, విశాల భారతి:** బడుగుల రాజ్యాధికారం దిశగా బీసీలు పయనించాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. మంగళవారం చిలకనగర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి ఉత్సవాలు గజ్జల సత్సంగం అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వరం, అనంతోజు బ్రహ్మచారి, భాస్కర్ గౌడ్ అండి గారి రాజు శ్రీనివాస్ గౌడ్ తో కలిసి గణేష్ చారి హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగులకు జరుగుతున్న అన్యాయంపై ఎదిరించి పోరాటం చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనంత బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలి



- సామాజిక బాధ్యత గా భావించాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- నాటడమే కాదు సంరక్షణ కూడా ముఖ్యమే
- భవిష్యత్ తరాలకు అటవీ సంపదని అందిద్దాం
- జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్

**విశాలభారతి, హనుమకొండ**

విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ వైద్య కళాశాల (కేఎంసి) వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ (వన మహోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే భావనతో మొక్కలను కాపాడితే అవే మనలను కాపాడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. వైద్య విద్యార్థులు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని, దానికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తాము వైద్య కళాశాలలో ఐదేళ్లు చదువు పూర్తి చేసే సమయానికి, తాము దత్తత తీసుకున్న మొక్క కూడా ఐదేళ్ల పాటు పెరిగి పెద్దదిగా మారేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అనేక వ్యాధులను నివారించేందుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులు, ముఖ్యంగా ముకుందరెడ్డి, పుల్లశెట్టి, లక్ష్మారెడ్డి తదితరులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో మొక్కలను ఉచితంగా అందించి కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కాకతీయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలతో ఇంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. నగరంలో భవిష్యత్తులో బహిరంగ ప్రదేశాలు తగ్గిపోయే పరిస్థితుల్లో కళాశాల ప్రాంగణం నగరానికి కీలకమైన గ్రీన్ స్పేస్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి బతికించడం అంతకంటే ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను కనీసం వచ్చే ఏడాది వరకు జాగ్రత్తగా సంరక్షిస్తే వాటి మనుగడ శాతం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

## సిపిఎం ఆలోచనలోంచి పుట్టిందే

# గోదావరినది పై ప్రాజెక్టు

- నిర్వాసిత రైతులకు మేలు చేకూర్చితేనే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయోజనం
- డిజైన్లు మార్పిడితోనే కాలయాపన చేశారు
- సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు వెంటనే కేటాయించాలి
- యుద్ధ ప్రాతిపదికన సీతారామ, సీతమ్మ సాగర్ ను పూర్తి చేయాలి
- డిస్ట్రిబ్యూటరీ కాలవలు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి
- విలేకరుల సమావేశంలో పోతినేని సుదర్శన రావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం, కుమ్మరిగూడెం సమీపానగల గోదావరి నదిపై ప్రాజెక్టు నిర్మాణం సిపిఎం పార్టీ ఆలోచనలోంచి పుట్టినదేనని సిపిఐ (ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మంగళవారం సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులను ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ (ఎం) పార్టీ నాయకుల బృందంతో కలిసి సందర్శించినా ఆయన ప్రాజెక్టుల నిర్మాణ పనుల తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం ఆనకట్ట వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గోదావరి నదిపై ప్రాజెక్టు నిర్మించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తమ్మినేని వీరభద్రం నేతృత్వంలో పాదయాత్రలు చేపట్టామన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు రూ. 24 వందల కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అప్పటినుండి 21 సంవత్సరాల పాటు కొనసాగుతున్న ఈ సాగునీటి ప్రాజెక్టు తొలుత రాజీవ్ సాగర్ ప్రాజెక్టుగా మొదలై అనంతరం సంభవించిన పరిణామాల వలన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 7940 కోట్లతో సీతారామ సాగర్ ప్రాజెక్టుగా మొదలైందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం తీవ్రమైన జాప్యంతో కొనసాగుతూనే డిజైన్లు మార్పులు జరిగాయే తప్ప పూర్తిస్థాయిలో పనులు జరగలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణం అంతా అస్తవ్యస్తంగా ఉందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు అనేక పర్యాయాలు ప్రాజెక్టును సందర్శించి ఆర్భాటపు ప్రకటనలు చేశారే తప్పా రైతు ప్రయోజనాల కోసం వారు వనగూర్చింది ఏమీ లేదన్నారు. అస్తమానం ఎస్టిమేట్లు రివైజ్ అవుతున్నాయే తప్పా ప్రాజెక్టులో మెరుగైన పురోగతి కనిపించడం లేదన్నారు. బిఆర్ఎస్ హయాంలోనే 104 కిలోమీటర్ల కాలువలు తవ్వి ఆర్భాటం చేశారని వీటి వలన రైతులకు ప్రయోజనం చేకూరేలా డిస్ట్రిబ్యూటరీ కాలువలను చేపట్టలేదని ఆయన విమర్శించారు.

**పూర్తయిన సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు ఇవ్వండి :**

పూర్తిచేసిన సీతారామ సాగర్ ద్వారా అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువుతోపాటు నాగారం మూకమామిడి తోపాటు రైతులకు సాగునీరు అందించే మరికొన్ని చెరువులను నింపి రైతులకు యుద్ధ ప్రాతిపదికన సాగునీవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అధిక నిధులను కేటాయించి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్ట ఆధారంగా సాగునీటిని తీసుకునే అవకాశం ఉందని, ఎల్ నినో ప్రభావంతో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను రైతులకు అందించాలని ఆయన సూచించారు.

**ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన నిర్వాసితులే మొట్టమొదటి లబ్ధిదారులు కావాలి**

సీతారామ సాగర్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులే మొట్టమొదటి లబ్ధిదారులయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని వారికి సాగునీరు అందించాలని పోతినేని ప్రభుత్వాన్ని కోరారు. అశ్వాపురం మండలంలోని ఎంతోమంది రైతులు రాజీవ్ సాగర్, సీతారామ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములను దారా దత్తం చేసి తీవ్రంగా నష్టపోయారని ఆయన గుర్తు చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన వారే మొట్టమొదటి లబ్ధిదారులు అయితే ప్రాజెక్టు నిర్మాణానికి ఓ సార్థకత ఉంటుందన్నారు.

### దుమ్ముగూడెం ప్రాంతంలోని పొగళ్లపల్లి లిఫ్ట్‌ను పూర్తి చేయాలి

దుమ్ముగూడెం మండలంలోని పొగళ్లపల్లి లిఫ్ట్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించి, పూర్తిచేస్తే 30 వేల ఎకరాలకు సాగునీరందించి రైతులకు ఉపయోగ ఉంటుందని ఆయన ప్రభుత్వానికి సూచించారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ ప్రాంత రైతులకు గోదావరి జలాలను సాగునీరుగా అందించాలని అనేకసార్లు సూచించినట్లు ఆయన తెలిపారు. సీతారామ సాగర్ ద్వారా భద్రాద్రి, ఖమ్మం జిల్లాల రైతులకు ప్రయోజనం చేకూరేలా డిస్ట్రిబ్యూటరీ కాలువలు పూర్తిచేసి సాగునీరు అందించడంతో పాటు, ప్రభుత్వం ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించకుండా సీతమ్మ సాగర్ యుద్ధ ప్రాతిపదికన నిర్మించేందుకు అవసరమైన నిధులు కేటాయించి ప్రాజెక్టుని పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు మేలు చేకూరేలా ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈసమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, అన్నవరపు కనకయ్య, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై విక్రం, రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, ఎర్ర శ్రీనివాస్, పాయం నరసింహారావు, సర్గం బాల నరసయ్య, పాయం భద్రయ్య, సత్రపల్లి సాంబశివరావు, తుమ్మల వెంకన్న పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

# 376వ జయంతి వేడుకలు

- దోపిడీకి వ్యతిరేకంగా బలహీనులకు అండగా ఉండడం ఆయన మనకు ఇచ్చిన సందేశం
- మోగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్
- పబ్బు రాజు గౌడ్ కాంగ్రెస్ మునుగోడు ఎన్నికల సమన్వయకర్త

**చౌటుప్పల్,విశాల భారతి:**

మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి చౌరస్తాలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఆయన 376వ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజ్ గౌడ్ మాట్లాడుతూ, సర్దార్ పాపన్న గౌడ్ త్యాగం, పాలనా దక్షత, ప్రజా సంక్షేమం కోసం చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. "పాపన్న గౌడ్ మన తెలుగు నేలకు గర్వకారణం. ఆయన చూపిన ధైర్యం, స్వాభిమానం నేటి తరానికి స్ఫూర్తి" అని పేర్కొన్నారు.ఆయన కేవలం యోధుడు మాత్రమే కాదు. ప్రజల కష్టాలు చూసి చలించిన పాపన్న రైతులు, పేదలపై అధిక పన్నులు వేసే జమీందారులు, మొఘలులు, నిజాం సైన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. దోపిడీదారుల నుండి సొమ్ము తీసి పేదలకు పంచేవారు. అందుకే ఆయనను "తెలుగు రాబిన్ హుడ్" అని కూడా పిలుస్తారు.మొఘల్ సామ్రాజ్యం, గోల్కొండ నవాబుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధ పద్ధతులతో పోరాడారు. చిన్న సైన్యంతోనే పెద్ద సైన్యాలను ఎదుర్కొని ప్రజల మద్దతుతో అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన పాలనలో ప్రజలకు న్యాయం, రక్షణ లభించాయి. పాపన్న గౌడ్ ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటికీ గిరిజన, బడుగు బలహీన వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, జయంతి వేడుకలు ప్రతి ఏటా ఘనంగా జరుగుతాయి. 376 సంవత్సరాలు గడిచినా పాపన్న గౌడ్ ఆశయాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. దోపిడీకి వ్యతిరేకంగా నిలబడటం, బలహీనులకు అండగా ఉండటం ఆయన మనకు ఇచ్చిన సందేశం అని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## సెప్టెంబర్ 9న వరంగల్లో జరిగే ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల

# జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



- ప్రజా సమస్యలను గుర్తించి బలమైన పోరాటాలను నిర్మించాలి
- ఈ దేశంలో దుర్మాగమైన కులవ్యవస్థను రద్దు చేయాలి
- అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించాలి
- చదువుకున్న యువతతోనే ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలి
- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి చదువుకున్న యువతరంతోనే నిర్మాణం చేయాలని, ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ పీడిత వర్గాల విముక్తి సైన్యంగా మార్చి మాదిగలతో పాటుగా పేద వర్గాల భవిష్యత్తు కోసం ఉద్యమించాలని అందులో భాగంగానే సెప్టెంబర్ 9న వరంగల్లో ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభను నిర్వహిస్తున్నామని ఈ సభకు అన్ని మండల కమిటీలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వినోద కన్వెన్షన్ హాల్ ఎమ్మార్పీఎస్ ఇబ్రహీంపట్నం మాజీ అధ్యక్షులు జుట్టు సతీష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదల కోసం మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడాలని ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా పోరాటాలను నిర్మించి మహనీయుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ దేశంలో దుర్మాగమైన కులవ్యవస్థ ఉండడం వల్లనే మెజార్టీగా అణగారిన వర్గాలు పేదరికంలోనే ఉన్నాయని, మన ఆర్థిక ఎదుగుదలకు అడ్డంకిగా మారిన పేదరికానికి, వివక్షతకు కారణమైన కుల వ్యవస్థను రద్దు చేయాలని, దోపిడీ, పీడన, అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను గుర్తించి ప్రజా ఉద్యమాలను నిర్మించాలని ఆ దిశగా గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ శక్తివంతంగా మలచాలని కోరారు. గ్రామ కమిటీల ఏర్పాటు విషయంలో నాయకులు నిర్లక్ష్యం వీడి వెంటనే గ్రామాల్లో పర్యటించి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని అనుబంధ సంఘాల కమిటీలను కూడా నిర్మించాలని, రాజకీయ పార్టీలతో సంబంధం లేని చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 5లోపు అన్ని గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి వరంగల్ జాతీయ మహాసభకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ సమావేశంలో విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య, ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబూ మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుంటి మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్ము మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి,సీనియర్ నాయకులు మంద సుధాకర్ మాదిగ, వీర్లపల్లి బాబూ మాదిగ, కాళ్ళ జంగయ్య మాదిగ, బోడ ముత్యాలు మాజీ యాచారం అధ్యక్షులు, ములి మహేష్ మాదిగ, మంచాల మాజీ అధ్యక్షులు నోముల సుధాకర్, కొంగరి రవి, చిత్రం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు

- విద్యార్థుల సంఖ్య ఆధారంగా వర్క్ అడ్జస్ట్మెంట్
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలు, సలహాలు స్వీకరణ
- పారదర్శకంగా ప్రక్రియ చేపడుతున్నాం: డీడీ దేశిరాం నాయక్
- గిరిజన పాఠశాలల బలోపేతానికి సహకరించాలని విజ్ఞప్తి

**మహబూబాబాద్ జిల్లా, విశాల భారతి:**



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై మంగళవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరాం నాయక్ తన ఛాంబర్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరయ్యారు. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 25 ప్రకారం వర్క్ అడ్జస్ట్మెంట్‌లో భాగంగా సర్దుబాటు చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. విద్యార్థుల సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలను గుర్తించి, అక్కడ సిబ్బంది కొరతను అధిగమించేలా సర్దుబాటు చేపట్టే అంశంపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి సర్దుబాటు ప్రక్రియకు సంబంధించిన అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల అవసరం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ దేశిరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన పాఠశాలలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయ సంఘాలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల అందుబాటును సమతుల్యం చేయడం ద్వారా పాఠశాలల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏటీడీవో ఎం. ఉపేందర్, ఏసీఎంవో డి. రాములు, ప్రధానోపాధ్యాయులు పి. శ్రీనివాస్, వి. సారంగపాణి, డి. సారయ్య, ఈ. సురేందర్‌రావుతో పాటు పీజీహెచ్ఎం అసోసియేషన్, టీఎస్టీడబ్ల్యూటీయూ, పీఆర్టీయూ, టబ్ల్యూటీయూటీఎస్, యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఏటీఏ, టీఎస్టీటీఎఫ్, ఏటీఎఫ్, టీజీటిటీఎఫ్, డీటీఎఫ్, టీపీయూఎస్ తదితర ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

# ఈ నెల 23న మాలల మహాధర్నా

- ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన
- దుబ్బాకలో భారీగా తరలిరావాలని మాల మహానాడు నేతల పిలుపు

**విశాల భారతి, సిద్దిపేట :** ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 23న దుబ్బాకలో నిర్వహించనున్న మాలల మహాధర్నాను విజయవంతం చేయాలని మాల మహానాడు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'హలో మాల.. చలో దుబ్బాక' మహాధర్నా పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై మాల సామాజికవర్గం ఐక్యంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. దుబ్బాకలో నిర్వహించనున్న మహాధర్నాకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న మాల నిరుద్యోగులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్న మాలలకు ప్రస్తుతం అన్యాయం జరుగుతుండటం బాధాకరమన్నారు. ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం కారణంగా మాలలకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. మాలలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాల్వ నరేష్, మండల యాదగిరి, దారస్వామి, కాల్వ లింగం, రమేష్, భాను, కిషోర్, శేఖర్, నరేష్, సురేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది

'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు.
మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను.
ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.